Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 27.09.2019, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 17 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com



మన ఊరిలో వరి పండిస్తాం. పక్క ఊరిలో కందిపప్పు పండిస్తారు. వెనుక ఊరిలో మిరప పండిస్తారు. ఈ మూడు ఊర్లలో పండినవి ఒకరికొకరు కొంటేనే, ఇచ్చి పుచ్చుకుంటేనే అది ఆహారంగా మారుతుంది. మాది మీకు ఇవ్వం... మీది మాకొద్దు అని బిగదీసుకుంటే ఎవరు పండించినవి వాళ్ళకు పూర్తి స్థాయిలో పనికిరావు.

ఇలాంటిదే ఇంకో ఉదాహరణ... 1947లో మత ప్రాతపదికన భారత్ నుండి పాకిస్థాన్ విడిపోయింది. ఆరోజు నుండి ఈరోజు వరకు ఆ దేశం కాశ్మీర్ పేరుతో మనతో కొట్లాడుతూనే వుంది. ఫలితం... ఇరు దేశాల వైపు నుండి లక్షల సంఖ్యలో మరణాలు, లక్షల కోట్లలో ఆస్థి నష్టం. అదే విడిపోయినా కూడా ఆ దేశం భారత్‌తో సఖ్యతగా ఉండుంటే ఉగ్రవాదం కోసం, భారత్‌లో బాంబు పేలుళ్ళ కోసం ఖర్చుపెట్టిన డబ్బుతో తమ దేశంలో ఎన్నో అభివృద్ధి పనులు చేసుకొని వుండొచ్చు. వివిధ రంగాలలో పురోగతి కోసం భారత్ సహకారం తీసుకుని వుండొచ్చు.

ఇరుగుపొరుగుతో శత్రుత్వం వుంటే ఏ విధమైన ఫలితాలుంటాయి, స్నేహంగా వుంటే ఎలాంటి ప్రయోజనాలుంటాయన్నదానికి ఇది చిన్న ఉదాహరణ.

# ఈ స్నేహం... తెలుగు రాష్ట్రాలకు వెలుగవుతుందా?

- గోదావరి జలాల సద్వినియోగంపై ఇరు రాష్ట్రాల సీఎంల ప్రత్యేక శ్రద్ధ
- కలిసి సాగితే సమస్యలన్నీ కొలిక్కి వచ్చినట్లే!

**2014** నాటి విభజన తాలూకు విషజ్ఞాపకాలను పక్కనపెట్టి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ఏపి ముఖ్యమంఅరతి వై.యస్. జగన్మోహన్‌రెడ్డి నెరపుతున్న స్నేహ సంబంధాలు ఉభయ తెలుగు రాష్ట్రాలకు మేలు కలిగించేవిగానే వుంటున్నాయి. ఈ నాలుగు నెలల కాలంలోనే ఇరు రాష్ట్రాల సీఎంలు ఒకొటికి మూడుసార్లు సమావేశం కావడం, ఇరు రాష్ట్రాల మధ్య నెలకొన్న విభజన సమస్యలను పరిష్కరించుకోవడం, అలాగే ఇరు రాష్ట్రాలకు ఉపయోగపడేలా నదీ జలాలను వాడుకోవడంపై చర్చలు జరగడం శుభపరిణామమే! ముఖ్యంగా సముద్రానికి నిరుపయోగంగా పోతున్న వేలాది టిఎంసీల గోదావరి నీళ్ళను ఉపయోగించుకోవడంపై ఇద్దరు ముఖ్యమంత్రులు దృష్టి సారించారు. ఈ ఏడాది కూడా గోదావరి వరద జలాలు వృధాగా సముద్రానికి పోవడం చూశాం. పోలవరం ప్రాజెక్ట్ పూర్తయితే (మిగతా 11వ పేజీలో)

## రివర్స్.. సక్సెస్



- అంచనాలకు తగ్గట్లుగా బిడ్‌లు
- పోలవరంను దక్కించుకున్న మేఘ

11లో

- వైసిపి నేతల్లో...

## అసంతృప్తి జాడలు!



అవినీతి సంపాదన అవకాశాలు లేవని ఆవేదన

వైయస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకుని నాలుగు నెలలు పూర్తయ్యాయి. ఈ నాలుగు నెలల ఆయన పాలనపై అసంతృప్తిగా వున్నదెవరు? తెలుగుదేశం వాళ్ళకు ఎలాగూ అసంతృప్తి వుండదు. ఎందుకంటే వైసిపి ప్రభుత్వం నుండి వాళ్ళు ఎటువంటి ప్రయోజనాలను ఊహించరు. మరి సామాన్య ప్రజలు... వాళ్ళు బ్రహ్మాండంగానే వున్నారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలన్నింటిని కూడా జగన్ మూడంటే మూడు నెలల్లోనే అమలులోకి తెచ్చేశాడు.

మరి ఆయన పాలనపై అసంతృప్తిగా వున్నదెవరంటే ఆయన కొలువులోని మంత్రులు, ఎమ్మెల్యేలు, వైసిపి నాయకులు, కార్యకర్తలే! ఇది నిజం కూడా! వైసిపి అధికారంలోకి వస్తే గతంలో చంద్రబాబులాగే పాలన వుంటుందని, ఇష్టారాజ్యంగా అవినీతికి పాల్పడవచ్చని చాలామంది భావించారు. తీరా చూస్తే జగన్ వద్ద ఆ ఆటలు సాగడం లేదు. అవినీతి, లంచాలు వంటివాటి విషయంలో ఆయన చాలా నిక్కచ్చిగా వుంటున్నాడు. అవినీతి, ముడుపులు వంటి వాటికి (మిగతా 11వ పేజీలో)



# దేవుళ్ళనూ వదలని దొంగలు


## • ఆలయాల్లో పెరుగుతున్న చోరీలు



మారుమూల గ్రామీణప్రాంతాల్లో ఉన్న ఆలయాలపై దొంగల కన్ను పడినట్లుంది. రాత్రివేళల్లో చడీచప్పుడు లేకుండా వచ్చి హుండీలను ఎత్తుకుపోతున్నారు. ఆలయాల్లో విలువైన వస్తువులను చోరీ చేసుకుపోతున్నారు. ఈ దొంగతనాలతో గ్రామాల్లో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈనెల 24వ తేది రాత్రి కలిగిరి మండలంలోని అనంతపురం గ్రామంలో ఉన్న కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్దకు వచ్చిన దుండగులు నిర్భయంగా ఆలయం గేట్లు పగులగొట్టి లోపలికి వెళ్ళి గడ్డపారలతో అక్కడున్న రెండు హుండీలను పెకలించి మరీ ఎత్తుకుపోయారు. అక్కడికి దగ్గరలోనే ఉన్న వాగులో ఒక హుండీని పగులగొట్టి అందులో ఉన్న డబ్బు తీసుకుని హుండీని వదిలి వెళ్ళారు. మరొక హుండీ మాత్రం కనిపించలేదని స్థానికులు చెప్తున్నారు. అదేవిధంగా అదేరోజు రాత్రి గూడూరు రూరల్ మండలంలోని గ్రామదేవత కటాలమ్మ అమ్మవారి ఆలయంలో దుండగులు ప్రవేశించి గుడి తాళాలు పగులగొట్టి అమ్మవారి మెడలో ఉన్న మూడున్నర సవర్ల బంగారు ఆభరణాన్ని, 5కేజీల వెండిని అపహరించుకుపోయారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే ఆయాప్రాంతాల పోలీసు ఉన్నతాధికారులు, క్లూస్‌టీం బృందాలు వచ్చి గ్రామస్తులనుంచి వివరాలు సేకకరించి, దుండగుల ఆచూకీ కోసం గాలింపు ప్రారంభించారు. కలిగిరి సిఐ రవికిరణ్, ఎస్ఐ పి.ఆదిలక్ష్మి, అదేవిధంగా గూడూరు రూరల్ సిఐ రామకృష్ణారెడ్డి తదితరులంతా హుండీ దొంగలను పట్టుకునేందుకు గాలింపు ముమ్మరం చేశారు. జిల్లాలోని మారుమూల గ్రామాలు, పట్టణాల్లోని ఆలయాలు అన్ని చోట్లా తప్పనిసరిగా సిసి కెమెరాలు ఉండేలా జిల్లా పోలీసు ఉన్నతాధికారులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు చొరవ తీసుకోవాలని, అదేవిధంగా గ్రామ ప్రాంతాల్లోనూ ముఖ్యమైన కూడళ్ళ వద్ద నిఘా కెమెరాలతో పాటు, నిఘా పోలీసు బృందాలు కూడా ఉంటే ఇలాంటి చోరీలను అరికట్టవచ్చని గ్రామస్తులు సూచిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని ఆలయాల్లో భద్రతకు, చోరీల నివారణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

# తమిళనాడుకు తెలుగుగంగ

చెన్నై ప్రజల అవసరాల నిమిత్తం నెల్లూరు జిల్లా రాపూరు మండలం కండలేరు జలాశయం నుండి తాగునీటిని ఈనెల 25 న తెలుగుగంగ చీఫ్ ఇంజినీర్ మురళీనాథ్ రెడ్డి చేతుల మీదుగా విడుదల చేశారు. తొలివిడతగా 500 క్యూసెక్కుల నీటిని కండలేరు సాయిగంగ కాలువకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన తమిళనాడు ఇంజినీరింగ్ అధికారులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. వర్షాల కారణంగా శ్రీశైలం నిండి సోమశిలకు పుష్కలంగా నీళ్ళు చేరాయన్నారు. దీంతో కండలేరు నుంచి చెన్నైకి తాగు నీరిచ్చేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నీళ్ళు చెన్నైకి 4నెలలుపాటు ప్రవహిస్తాయన్నారు. ఏడాదికి కండలేరు నుంచి చెన్నైకి 5 టీఎంసీల తాగునీరు ఇవ్వాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగా తొలివిడతగా 1.5 టీఎంసీల నీటిని విడుదల చేస్తామన్నారు. మరో మూడు,నాలుగు నెలల్లో మిగిలిన 3.5 టీఎంసీల నీటిని ఇస్తామన్నారు.




# కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా గోపి

నెల్లూరు నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్‌గా గోపిని నియమిస్తూ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ కార్యదర్శి శ్యామల రావు తాజాగా ఉత్తర్వులు జారీచేశారు. డ్వామాలో ఏపీడీగా విధులు నిర్వహిస్తున్న గోపి కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు.

# వెంకటగిరి జాతరలో పెరిగిన హుండీ ఆదాయం

### గత ఏడాది కన్నా 2.3 లక్షలు పెరిగిన రాబడి

వెంకటగిరి పోలేరమ్మ అమ్మవారి జాతరకు గత ఏడాది కన్నా ఈసారి 2.3 లక్షల రూపాయల ఆదాయం పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే అమ్మవారికి భక్తుల సమర్పించుకునే కానుకలు కూడా ఈసారి పెరిగాయి. ఈనెల 18-19 తేదీల్లో అంగరంగ వైభవంగా పోలేరమ్మ అమ్మవారి జాతర జరిగిన అనంతరం ఈనెల 20న ఆలయంలో హుండీ లెక్కింపు నిర్వహించగా, అమ్మవారి ఆలయానికి 28,28,963 రూపాయల ఆదాయం వచ్చిందని దేవాదాయశాఖ ఇ.ఓ వెంకటేశ్వరరెడ్డి తెలియజేశారు. హుండీ ద్వారా 13,12,019 రూపాయలు రాగా, విరాళాల ద్వారా 1,57,244 రూపాయలు, నూరు రూపాయల టిక్కెట్ల ద్వారా 5,13,700 రూపాయలు, 200 టిక్కెట్ల ద్వారా 84,600 రూపాయలు ఆదాయం వచ్చిందన్నారు. ఇవేకాక భక్తులు బంగారు 56.580 గ్రాములు, వెండి 1.896.350 గ్రాములు కానుకలుగా అమ్మవారికి సమర్పించుకున్నారని ఆయన వివరించారు.

# మద్యం షాపును వ్యతిరేకిస్తున్న మహిళలు

వెంకటగిరి పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేయాలనుకుంటున్న ప్రభుత్వ మద్యం షాపును స్థానిక మహిళలు వ్యతిరేకిస్తున్నారు. దీనిపై వాళ్ళు ఆందోళనకు దిగుతున్నారు. ఇక్కడ మద్యం షాపు వద్దంటూ ఎక్సైజ్ అధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించారు.

## ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌లో

# ఇద్దరు నెల్లూరీయులు

- అధ్యక్షుడిగా పెనాక శరత్‌చంద్రారెడ్డి
- ఉపాధ్యక్షుడిగా వి.వి.యస్.యస్.కె.కె.యాచేంద్ర



పెనాక శరత్‌చంద్రారెడ్డి



వివియస్‌యస్‌కెకె యాచేంద్ర

***ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఈసారి ఇద్దరు నెల్లూరీయులు ఎంపిక కావడం ఓ విశేషమైతే ఆ ఇద్దరూ వెంకటగిరి క్రికెట్‌క్లబ్ నుండి ఎంపికైనవారు కావడం మరో విశేషం.***

1953లో ఏర్పడిన క్రికెట్ క్లబ్, బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియాకి(బిసిసిఐ)కి అనుసంధానంగా దక్షిణ భారతదేశంలో ఓ విభాగంగా పని చేస్తోంది. నెల్లూరుజిల్లా కొడవలూరు మండలం పెయ్యలపాళెంకు చెందిన పెనాక రామ్‌ప్రసాద్‌రెడ్డి కుమారుడు పెనాక శరత్‌చంద్రారెడ్డి ఈసారి ఆంధ్రా క్రికెట్ క్లబ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యాడు. అరవిందో ఫార్మా ఛైర్మెన్‌గా, భారతదేశానికి చెందిన వందమంది అత్యంత ధనికుల్లో ఒకడిగా రామ్‌ప్రసాద్‌రెడ్డి నెల్లూరీయులకు చిరపరిచితుడే. శరత్‌చంద్రారెడ్డి అరవిందో ఫార్మాలో డైరెక్టర్‌గా అనతికాలంలోనే తండ్రికి తగ్గ తనయుడిగా పేరు తెచ్చుకున్నాడు. వ్యాపారం ఆయన వృత్తైతే క్రికెట్ అతని ప్రవృత్తి. నెల్లూరుజిల్లా వెంకటగిరి సంస్థానానికి చెందిన క్రికెట్ క్లబ్ పక్షాన శరత్ ఆంధ్రా క్రికెట్ క్లబ్‌కి అధ్యక్షుడిగా ఎంపిక కాబడ్డాడు. ఇదే వెంకటగిరి సంస్థానానికి చెందిన రాజ కుటుంబీకుడు వెలుగోటి వెంకట సత్యసర్వఘ్న కుమార కృష్ణ యాచేంద్ర ఆంధ్రా క్రికెట్ క్లబ్ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపిక కాబడ్డాడు. గురువారం నాడు మొత్తం క్రికెట్ క్లబ్ కమిటి అంతా ఏకగ్రీవం కాగా, వారిలో ఒకరు వ్యాపారవేత్త, మరొకరు రాజకుటుంబీకులు కావడం, ఇద్దరూ మన నెల్లూరీయులే అవడం విచిత్రం, ఆనందదాయకం. అధ్యక్ష ఉపాధ్యక్షులిద్దరికీ 'లాయర్' అభినందనలు.

## భారతదేశంలో 100 మంది అత్యంత ధనికులలో ఒకడిగా మరోసారి

# 51వ స్థానంలో పెనాక రామ్‌ప్రసాద్‌రెడ్డి



పెనాక రామ్‌ప్రసాద్‌రెడ్డి

గత నవంబర్‌లో "ఫోర్బ్స్" నిర్వహించిన సర్వేలో భారతదేశంలోని 100 మంది అత్యంత ధనికుల్లో 50వ స్థానం సంపాదించిన అరవిందో ఫార్మా ఛైర్మెన్, మన నెల్లూరీయుడు పెనాక రామ్‌ప్రసాద్‌రెడ్డి తాజాగా "ఐఐఎఫ్‌ఎల్ వెల్త్ మేనేజ్‌మెంట్" చేసిన మరో సర్వేలో 51వ స్థానాన్ని పొందాడు. తొలి వంద ర్యాంకుల్లో తెలుగోళ్ళకు 51, 57, 63, 83, 89 ర్యాంకులు వస్తే వారిలో రామ్‌ప్రసాద్‌రెడ్డి 51వ స్థానంలో నిలవడం గర్వకారణం. అరవిందో లాబొరేటరీస్ ద్వారా తన వ్యాపార సామ్రాజ్యాన్ని ప్రపంచమంతా విస్తరించి అనేకమంది వ్యాపార దిగ్గజాలతో ఢీకొంటూ ఆయన ఈ స్థానాన్ని సాధించడం గొప్ప విషయం. రామ్‌ప్రసాద్‌రెడ్డికి నెల్లూరీయుల పక్షాన అభినందనలు.



ప్రజాప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనిల్

# ఇసుక అక్రమ రవాణాకు కళ్లెం

## - మంత్రి అనిల్‌కుమార్ యాదవ్

రాష్ట్రంలో ఇసుక అక్రమ రవాణాను సహించే ప్రశ్నే లేదని, అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి పి.అనిల్‌కుమార్ యాదవ్ హెచ్చరించాడు. ఈ నెల 25వ తేదీన నెల్లూరులోని పినాకిని అతిథి గృహంలో మంత్రి అనిల్‌కుమార్ జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నెల్లూరు పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు రూరల్, కావలి శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు, జాయింట్ కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ ఐశ్వర్య రస్తోగిలు కూడా హాజరయ్యారు. ఇసుక విధానం, అక్రమ రవాణాను నిరోధించే అంశాలపై మంత్రి సమావేశంలో చర్చించాడు.

అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో అన్ని నదుల్లో వరద ప్రవాహం వున్నందున నెల్లూరు, శ్రీకాకుళం జిల్లాల్లోనే ఇసుక అందుబాటులో వుందని, కాబట్టే కొందరు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టి అక్రమ రవాణాకు కళ్లెం వేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నాడు. జిల్లాలో ఇసుక అవసరాలు తీర్చే విధంగా కొత్త రీచ్‌లను పరిశీలించడం జరుగుతోందని, త్వరలోనే అన్ని ఇసుక రీచ్‌లలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసి అక్రమ రవాణాకు తావు లేకుండా పూర్తిగా ప్రక్షాళన చేస్తామన్నాడు. ఏ రాజకీయ పార్టీ నాయకుడు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడ్డా ఉపేక్షించేది లేదన్నాడు.




# 'ప్రభా'తం

## హౌడీ..జోడీ



హ్యూస్టన్‌లో జరిగిన 'హౌడీ మోడీ' కార్యక్రమం దిగ్విజయం కావడం అందరూ ఊహించిందే. ప్రపంచంలోనే రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలకు సంబంధించి ఇదొక చరిత్రాత్మక కార్యక్రమంగా నిలచిపోయింది. వేలాదిమంది ప్రవాస భారతీయులు పాల్గొన్న ఈ అతిపెద్ద కార్యక్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్రమోడీ ఎంతో ఉత్సాహంగా పాల్గొనడంతో అమెరికా-భారత్ ఒక్కటైపోయినట్లయింది. ఇరుదేశాల స్నేహబంధాలు దీంతో మరింత బలోపేతమైనట్లయింది.

**'హౌడీ మోడీ'** కార్యక్రమం ప్రపంచంలోనే రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలకు సంబంధించి ఒక అద్వితీయమైన..అమోఘమైన..చరిత్రాత్మక కార్యక్రమంగా నిలచిపోయింది. వేలాదిమంది ప్రవాసభారతీయులు పాల్గొన్న ఈ అతిపెద్ద కార్యక్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్రమోడీ ఎంతో సంతోషంగా.. ఉత్సాహంగా పాల్గొనడంతో అమెరికా-భారత్ ఒక్కటైపోయినట్లయింది. అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో ఉన్న హ్యూస్టన్‌లో జరిగిన ఈ బృహత్ కార్యక్రమం ప్రవాసభారతీయుల సంతోష సంరంభాలతో అంబరాన్నంటే సంబరంగా మారింది. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రసంగించిన పోడియంపై భారత్-అమెరికాల మైత్రీపతాకం మెరిసిపోయింది. ఇరుదేశాల స్నేహబంధానికి ప్రతీకగా నిలిచిన పతాకగా హ్యూస్టన్ వేదిక మురిసిపోయింది.

అందరూ అనుకున్నట్లే హ్యూస్టన్ సభ దిగ్విజయమైంది. దీంతో అమెరికాతో భారత్‌కు ఉన్న మైత్రీ బంధం మరింతగా బలపడినట్లయింది. ఈ కార్యక్రమంలో ఇరు దేశాల నేతలు మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి ప్రబలశత్రువైన ఉగ్రవాదాన్ని తరిమికొట్టేందుకు గట్టిగా కృషిచేస్తామని ప్రతిన బూనడం అన్నిదేశాల ప్రజలకు ఎనలేని సంతోషాన్ని కలిగించింది. అన్నిటికంటే విశేషంగా హ్యూస్టన్‌లో ఉన్న ఎన్ఆర్‌జి స్టేడియంలోకి 50వేల మందికిపైగానే విచ్చేసిన అమెరికన్-భారతీయులను ఉద్దేశించి, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సమక్షంలో భారత ప్రధాని నరేంద్రమోడీ చేసిన అత్యద్భుతమైన ప్రసంగం ప్రపంచ ప్రజలను బాగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మోడీ ఉపన్యసించిన తీరు, హావభావాలు, ఆ ఉత్తేజం..ఉద్వేగం యావత్ప్రపంచాన్నీ మంత్రముగ్ధులను చేశాయంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో కలసి ఆ బృహత్తరమైన వేదికపై సగర్వంగా నిలచిన ప్రధాని మోడీ ప్రపంచ ప్రజలందరి దృష్టినీ ఆకర్షించడమే కాక, అగ్రదేశాధినేత అయిన ట్రంప్ నుంచి అభినందనలను, ప్రశంసలను కూడా అందుకుని తన ప్రత్యేకతను, భారత్ విశిష్టతను మరోసారి చాటారు. 'భారత్‌తో పాటు ప్రపంచమంతటికీ మోడీ గొప్ప సేవ చేస్తున్నారు. భారత్ అత్యున్నత విలువలు, సంస్కృతి అమెరికా విలువలతో కలసిపోతాయి. ఇరుదేశాల మధ్య సంబంధాలు మునుపెన్నడూ లేనంతగా బలోపేతమయ్యాయి''..అంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ సభలో స్పష్టంగా పేర్కొనడం ప్రవాసభారతీయుల హృదయాలను ఆనందతరంగితుల్ని చేసింది. అంతేకాదు, భారత్‌లో మోడీ అమలుచేస్తున్న ఆర్థిక సంస్కరణలు అమోఘమని, ఆ సంస్కరణలతో లక్షలాదిమంది పేదరికం నుంచి బయటపడుతున్నారని అగ్రదేశాధినేత ట్రంప్ కొనియాడడం, అమెరికా అభివృద్ధిలో భారత్ పాత్ర మరువలేనిదని పేర్కొనడం ప్రవాస భారతీయులందరికీ గర్వకారణమైంది. అదేవిధంగా మోడీ కూడా ఉత్తేజపూరితంగా ఉపన్యసిస్తూ, అమెరికాతో భారత్‌కు ఉన్న స్నేహబంధాన్ని వివరించడం, వచ్చే ఏడాది జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ మళ్ళీ విజయం సాధించాలని ఆకాంక్షించడంతో అందరూ మరోసారి ఆనందాతిరేకాలు వ్యక్తం చేశారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నవారిపై నిర్ణయాత్మక పోరాటం చేయాల్సిన సమయం ఇదేనని, ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మద్దతుగా నిలిచారని మోదీ అనగానే సభికులంతా లేచి నిలబడి కరతాళధ్వనులతో ట్రంప్‌ను అభినందించడం విశేషం. అటు ట్రంప్..ఇటు మోడీ ప్రసంగాలతో సభాప్రాంగణం ఉర్రూతలూగింది. ప్రపంచ ఇంధన రాజధాని అయిన హూస్టన్ నగరం 'హౌడీ మోడీ' నినాదాలతో మార్మోగిపోయింది. 'హౌ డు యు డు..మోదీ' అనే ఆత్మీయమైన పలకరింపుకు 'హౌడీ మోదీ' అనేది సంక్షిప్త రూపం. 20 దేశాల ప్రతినిధులతో పాటు, అమెరికాలోని 48 రాష్ట్రాల నుంచి 50వేల మందికి పైగానే ప్రవాసభారతీయులు హాజరై మోదీకి కరతాళ ధ్వనులతో అద్భుతంగా.. ఆత్మీయంగా స్వాగతం పలకడం ఎంతైనా గొప్ప విశేషం. ప్రపంచంలోనే రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల అగ్రనేతలు సంయుక్తంగా అక్కడి ప్రజలను ఉద్దేశించి మాట్లాడడం కూడా ఇదే తొలిసారి కావడం, ప్రపంచంలో అగ్రరాజ్యమైన అమెరికా అధినేత వేలాదిమంది ప్రవాస భారతీయులు పాల్గొన్న సభకు విచ్చేసి భారత ప్రధాని మోడీని ప్రశంసించడం మరో అద్భుతం. గతంలో ఎప్పుడూ ఏ భారతీయ నేత విషయంలో కూడా ఇలాంటిది జరగలేదు. ఆ ఘనత ఇప్పుడు ప్రధాని మోడీకే దక్కింది. కశ్మీర్‌లో 370వ అధికరణం రద్దు భారత్ ఆంతరంగిక వ్యవహారమని ఇప్పటికే అమెరికా ప్రభుత్వం ప్రకటించివున్న నేపథ్యంలో, అమెరికా అధ్యక్షుని ఎదురుగానే ప్రధాని మోడీ ఆ అధికరణం రద్దు గురించి చెప్తూ, ఈ అధికరణం కశ్మీరీల అభివృద్ధికి ఆటంకంగా మారిందని, అది ఉగ్రవాదానికి ఊతమిచ్చిందని, దానిని ఉపసంహరించడం వల్ల మళ్ళీ జమ్ముకశ్మీర్‌లో అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేయడం చెప్పుకోదగ్గ విషయం. అంతేకాదు, పాకిస్తాన్‌కు విద్వేషమే అజెండా అని, అది ఉగ్రవాదుల అడ్డాగా మారిందని, ఉగ్రవాదంపై నిర్ణయాత్మక పోరుకు సమయం ఆసన్నమైందని మోడీ పేర్కొనడం అందరి హర్షధ్వానాలనందుకుంది. కరడుగట్టిన ఇస్లామిక్ ఉగ్రవాదం నుంచి సామాన్యప్రజలకు రక్షణ కల్పిస్తామని ట్రంప్ స్పష్టం చేయడం ప్రపంచదేశాల ప్రజలందరికీ ఆనందం కలిగించింది. ఏదేమైనా ఈ సందర్భంగా అమెరికా-భారత్‌లు తీసుకున్న నిర్ణయాలతో ఇరు దేశాల మధ్య మైత్రి మరింత దృఢతరం కావడం శుభపరిణామం. అన్నిటికీ మించి ప్రపంచ మానవాళికి పరమశత్రువైన ఉగ్రవాదం అంతుచూస్తామని ఈ వేదికపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ప్రధాని మోడీ ఇద్దరూ కలసికట్టుగా ప్రకటించడంతో ఈ వేదిక తన ప్రాధాన్యతను మరింతగా చాటుకుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## కమనీయం..

### లక్ష్మీనృసింహుని కళ్యాణం



ప్రముఖ పుణ్యక్షేత్రమైన రాపూరు మండలం పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి వారి కల్యాణోత్సవం ఈనెల 21న కన్నుల పండువంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ నృసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను శోభాయమానంగా అలంకరించి ఆలయంలోని నిత్యకల్యాణ మండపంలో స్వామివారికి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులందరికీ అన్నదాన సత్రంలో అన్న ప్రసాద వితరణ చేశారు. రాత్రి 1008 దీపాలను వెలిగించి సహస్రదీపాలంకరణ మండపంలో కొలువుదీర్చి స్వామివార్లకు నేత్రపర్వంగా ఊంజల్‌సేవ నిర్వహించారు. ఆలయ అర్చకుడు నాగరాజస్వామి నేతృత్వంలో వేదమంత్రాల మధ్య, మంగళ వాద్యాల మధ్య ఎంతో వేడుకగా జరిగిన ఈ వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివార్ల కల్యాణోత్సవం తిలకించారు.




## కాంగ్రెస్ పూర్తిగా భూస్థాపితం కావాలి

భారతదేశంలో ఈరోజున్న ప్రధాన సమస్యలకు మూలకారణం కాంగ్రెస్ పార్టీనే! స్వాతంత్ర్యం వచ్చి 73ఏళ్ళ తర్వాత కూడా ఈ దేశంలో కులాల కొట్లాటలు వున్నాయంటే కారణం ఆ పార్టీ ఓట్ల బ్యాంకు రాజకీయాలే! ఇన్నేళ్ళ తర్వాత కూడా భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశంగానే వుందంటే దానికి కారణం కూడా కాంగ్రెస్ పాలనే! కాంగ్రెస్ ఓటుబ్యాంకు రాజకీయాల వల్లే భారత్ ఇంకా అభివృద్ధి చెందలేదు. ఇప్పుడు భారతీయులు నిజాలు తెలుసుకుంటున్నారు. కాంగ్రెస్ చేసిన ద్రోహాలు బయటపడుతున్నాయి. కాబట్టే ఆ పార్టీ అన్ని రాష్ట్రాలలో తుడిచిపెట్టుకుపోతోంది. ఆ పార్టీ పూర్తిగా భూస్థాపితమైతేనే దేశానికి మంచి రోజులు.

**గార్లదిన్నె శోభన్, కలిగిరి.**

## కాలువ ఆక్రమణ

మండల కేంద్రమైన విడవలూరులో పీర్లచావిడి గ్రామ స్టేజ్ కాలువను మరియు స్థలాన్ని కబ్జా చేసి దర్జాగా గదులు కట్టి వున్నారు. గ్రామ స్టేజీ నిర్మాణానికి, పెంపుదలకు మరిన్ని నిధులు మంజూరుకు నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి హామీ ఇచ్చివున్నారు. ఇంతలోనే ఈ ఆక్రమణ జరిగింది. తక్షణం జిల్లా కలెక్టర్ కలుగజేసుకుని ఈ ఆక్రమణలను తొలగించాల్సివుంది. అలాగే ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కూడా ఈ సమస్యపై దృష్టి పెట్టాలి.

**పూండ్ల అచ్యుత్‌రెడి, విడవలూరు.**

## కోర్టు కానిస్టేబుల్ వేధింపులు

నెల్లూరురూరల్ పరిధిలోని వేదాయపాలెం పోలీస్‌స్టేషన్ కోర్టు కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వ్యక్తి కక్షిదారులను ఒత్తిడి చేసి డబ్బులు వసూలు చేస్తున్నాడు. డబ్బులు ఇవ్వకుంటే జైలుకు పంపుతానని బెదిరిస్తున్నాడు. ఎస్ఐ, సిఐలు కూడా నేను చెప్పినట్లే వింటారంటూ కక్షిదారులను భయపెట్టి కొడుతున్నాడు. తనకు డబ్బులివ్వకుంటే మరో కేసులో ఇరికిస్తానని బెదిరిస్తున్నాడు. నెల్లూరురూరల్ ఎమ్మెల్యే, ఎస్పీ, నగర డిఎస్పీలు ఈ సమస్యపై స్పందించి చర్యలు తీసుకోవాలి.

**పి.రంగారెడ్డి, పడారుపల్లి.**

## ఇద్దరికీ ఎంత తేడా!

గోదావరి పుష్కరాలలో తన మూలంగా 29 మంది చనిపోతే అప్పుడు ముఖ్యమంత్రిగా వున్న చంద్రబాబు నాయుడు మానవత్వం చూపలేదు. అదీగాక ఈ మధ్య ఆ సంఘటనపై మనుషులన్నాక చావకుండా వుంటారా అంటూ చౌకబారు స్టేట్‌మెంట్ కూడా ఇచ్చాడు. కాని మొన్న జరిగిన గోదావరి బోటు ప్రమాదంలో ముఖ్యమంత్రి వై.యస్. జగన్మోహన్‌రెడ్డి ఎంతో హుందాగా ప్రవర్తించాడు. ఈ ప్రమాదంలో మానవ తప్పిదమే అధికంగా వున్నప్పటికీ ప్రభుత్వ పరంగా బాధ్యత తీసుకున్నారు. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకూడదంటూ అధికారులకు ఆదేశాలిచ్చాడు. 40ఏళ్ళ అనుభవం చెప్పుకోవడానికి పనికొస్తుందేమో, సమస్యలు తీర్చడానికి కాదు.

**జి.ఎస్.రావు, నెల్లూరు.**

## మంచి పాలకుడికి ప్రకృతి సహకారం

మన ధర్మశాస్త్రాలు చెబుతుంటాయి.. పాలకుడి మనసు నిర్మలమైనదై వుంటే ఆ రాజ్యం సుభిక్షంగా ఉంటుందని. దీనికి ఉదాహరణ రామరాజ్యమే! ఆయన రాజ్యంలో ప్రజలు సుఖసంతోషాలతో, పాడిపంటలతో జీవించేవారని చదువుకున్నాం. ఆయన మనసులో ఎటువంటి కల్మషం లేకుండా ప్రజల శ్రేయస్సు కోరుకునే వాడు. అందుకనే మనం ఇప్పటికీ రామ రాజ్యం రావాలని కోరుకుంటుంటాం. ఇప్పుడు రాజ్యాలు పోయి ఆధునిక పరిపాలన విధానాలు వచ్చినా ఆ ధర్మసూత్రాలు, శాస్త్రాలు మారవు. దివంగత నేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి కల్మషం లేని మనసుతో ఐదేళ్లు పరిపాలన చేస్తే ప్రతియేటా వర్షాలే! ప్రకృతి ఎంతో సహకరించింది. చంద్రబాబు 14ఏళ్లు ఈ రాష్ట్రాన్ని పరిపాలిస్తే ఒకట్రెండేళ్ళు తప్పితే మిగతా కాలమంతా కరువే! ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి అలా వచ్చాడో లేదో ప్రకృతి పూర్తిస్థాయిలో సహకరించింది. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో డ్యామ్‌లు నిండాయి. పాలకుడు స్వచ్ఛంగా వుంటే ప్రకృతి పరవశిస్తుందని నిరూపించేందుకు నేడు జలకళ సంతరించుకున్న రిజర్వాయర్‌లు డ్యాంలే ఉదాహరణ.

**పల్లా మనోహర్, నెల్లూరు.**

## సంగీత సౌరభాలు గుబాళించిన ఆ ఇల్లు...

# ఇక వేదనాదాల హరివిల్లు

### వేదపాఠశాలగా సాంబమూర్తి గారి నివాసం




తిప్పరాజువారి వీధిలోని సాంబమూర్తి గారి ఇల్లు

సంగీత, సాహిత్య కళా రంగాలకు నిలయంగా నెల్లూరు నగరంలోని తిప్ప రాజువారి వీధిలో కొలువైన శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి గారి ఇల్లు ఇకపై వేదనాదాల హరివిల్లుగా విరాజిల్లబోతోంది. తన తల్లి శ్రీమతి శకుంతలమ్మ ఇటీవల కాలం చేయ డంతో తమ కుటుంబసభ్యుల అను మతితో తమ స్వగృహాన్ని కంచి కామ కోటి పీఠం వారికి అప్పజెప్పాడు యస్.పి.బాల సుబ్రహ్మణ్యం.

కంచి పీఠం వారి ఆధ్వర్యంలో త్వరలో ఆ ఇంట వేద పాఠశాల ప్రారంభం కాబోతోంది. నిన్నటి వరకూ సంగీత సౌరభాలను గుభాళింపజేసిన ఆ ప్రాంగణం వేదమంత్రాలకు నిలయంగా మారబోతోంది. తండ్రిలోని సద్గుణాలను తల్లిలోని దాన దయాగుణాలను పుణికి పుచ్చుకుని వేదపాఠశాలకు తమ ఇంటిని నిలయంగా మార్చి వారి రుణం తీర్చుకుంటున్న బాలు గారికి, వారి కుటుంబసభ్యులకు 'లాయర్' అభినందనలు.

భిక్షాటనా పూర్వక త్యాగరాజ సంస్మరణోత్సవాలను నగరంలో నిర్వహిస్తూ తన గాత్రం ద్వారా సింహపురి వాసులను మంత్రముగ్ధులను చేసిన తన తండ్రి శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి గారే తన దైవమని ఆయన కుమారుడు, భారతీయ సినిమా గాయకుడు యస్.పి.బాలసుబ్రహ్మణ్యం అన్నారు.

# మా దైవం.. మా నాన్న





శిల్పి ఆచార్య రాజ్‌కుమార్ ఉడయార్‌ను సత్కరిస్తున్న ఎస్.పి.బాలు, హజరత్‌బాబు, ప్రభు

నెల్లూరులోని శ్రీ వేంకటేశ్వర కస్తూ రిబా కళాక్షేత్రంలో పునఃప్రతిష్ట చేసిన తన తండ్రి విగ్రహాన్ని సెప్టెంబర్ 24వ తేదీ మంగళవారం యస్.పి.బాలు సందర్శించి తండ్రిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భావితరాలకు స్ఫూర్తిదాయ కంగా నైతిక విలువలు, సంస్కృతి సంప్ర దాయాలే ప్రాణంగా జీవించిన తన తండ్రి విగ్రహాన్ని అక్టోబర్ 3, 2015న ప్రతి ష్ఠించడం జరిగిందని, అప్పట్లో విగ్రహాన్ని రూపొందించిన శిల్పి రాంబాబు కంటే గొప్పగా ఆచార్య రాజ్‌కుమార్ ఉడయార్ తన తండ్రి విగ్రహాన్ని తయారు చేసి ఇవ్వడంతో పాత విగ్రహం స్థానంలో కొత్త విగ్రహాన్ని మురళీకృష్ణ హోటల్స్ వ్యవ స్థాపకులు గ్రోసు గోపాలయ్య ఆధ్వర్యంలో తన మిత్రబృందం సెప్టెంబర్ 21న పునః ప్రతిష్ఠ చేశారని, తాను ఈరోజు ఆ విగ్ర హాన్ని సందర్శించి తన తండ్రిని స్మరించు కున్నానని అంటూ సాంబమూర్తిగారి అబ్బాయిగా పుట్టడం తాను చేసుకున్న పుణ్యమని ఒక మహామేధావి తనయుడిగా ఆయన చేసిన గొప్ప కార్యాల ప్రతిఫలంగా తాను ఈరోజు భారతీయ సినిమా గాయ కుడిగా ఎదిగానని అన్నాడు.



మీడియాతో, మిత్రులతో ముచ్చటిస్తున్న ఎస్.పి.బాలు

మంగళవారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమంలో విగ్రహ రూపకర్త ఆచార్య రాజ్‌కుమార్ ఉడయార్‌ని బాలసుబ్ర హ్మణ్యం ఘనంగా సత్కరించాడు. మురళీ కృష్ణ హోటల్ ఎం.డి వీరిశెట్టి హజరత్ బాబు, తుంగా శివప్రభాత్‌రెడ్డి, వీరిశెట్టి శేఖర్, ఇంజనీర్ రాజేంద్రరెడ్డి, నలుబోలు బలరామయ్యతో పాటు వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్, యస్.పి.బాలు చిన్ననాటి స్నేహితులు, ఆప్తులు, ఆత్మీయులు, అభిమానులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ప్రభుత్వ వైద్యం

# బాగుపడేనా?

**ప్రభుత్వ వైద్యశాలలపై ప్రజలకు నమ్మకం లేదు. ఎందుకంటే ప్రాణం కంటే ఖరీదైంది ఏముంటుంది. ప్రాణం మీదకొచ్చి సర్కార్ దవాఖానాలకు పోతే సరిగ్గా ఆ సమయంలో డాక్టర్లుండరు. మందులుండవు. నర్సింగ్ స్టాఫ్ వుండరు. వైద్యపరికరాలు అందుబాటులో వుండవు. అత్యవసరానికి వెంటిలేటర్ సదుపాయముండదు. అందుకే డబ్బులు పోతే పోయినాయని చెప్పి కూలీనాలి చేసుకుని బతికేవాళ్లు కూడా రోగాలొస్తే ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. చిన్నచిన్న జబ్బులకు కూడా వేలకు వేలు ఖర్చు పెడుతున్నారు.**

అసలు ప్రభుత్వ వైద్యశాలలే బాగుంటే, అందులో ప్రభుత్వ వైద్యులు ఎప్పుడూ అందుబాటులో వుంటే, సరైన వైద్య సదుపాయాలుంటే ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీయాల్సిన ఖర్మేంటి? రోగాల కోసం ఆస్తులు అమ్ముకోవాల్సిన అవసరమేంటి?

ఓపక్క రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిధిని పెంచుతూనే ఇంకో పక్క ప్రభుత్వ వైద్యాన్ని కూడా గాడిలో పెట్టే ప్రయత్నాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో మొదటి అంకం ప్రభుత్వ వైద్యులు ప్రైవేట్ ప్రాక్టీస్‌పై నిషేధం విధించడం. ప్రభుత్వ వైద్యశాలలో పనిచేసే దాదాపు 90శాతం మంది వైద్యులకు సొంత ప్రాక్టీసు, సొంత ఆసుపత్రులు వుంటాయి. ఉద్యోగం చేసే ప్రభుత్వ ఆసుపత్రికి వీళ్లు సరిగ్గా రారు గాని, సొంత క్లినిక్‌లకు మాత్రం నిర్ణీత సమయం కంటే ముందే వుంటారు. కొందరు వైద్యులైతే ప్రభుత్వ ఆసుపత్రులలో తమ వద్దకొచ్చిన రోగులను ఆ తర్వాత తమ ప్రైవేట్ క్లినిక్‌లకు రప్పించుకుంటుంటారు. దాదాపు 90శాతం మంది వైద్యులకు సొంత క్లినిక్‌లు, లేదా వేరే కార్పొరేట్ ఆసుపత్రులలో ఉద్యోగాలు ఉన్నందువల్లే వీళ్లు ప్రభుత్వ ఆసుపత్రు లలో రోగులకు అందుబాటులో లేకుండా పోతున్నారు. డాక్టర్లు సరిగా వుండరనుకునే రోగులు ప్రభుత్వ వైద్యశాలలకు పోవడం మానేస్తున్నారు.

గతంలో బి.శ్రీధర్ జిల్లా కలెక్టర్‌గా వున్నప్పుడు ప్రభుత్వాసుపత్రిలో వుండాల్సిన సమయంలో తమ సొంత క్లినిక్‌లలో వున్న పలువురు ప్రభుత్వ వైద్యులను పట్టుకుని సస్పెండ్ చేయడం జరిగింది. అయితే, ఇప్పుడసలు ప్రభుత్వ వైద్యుల ప్రైవేట్ ప్రాక్టీస్‌నే ప్రభుత్వం నిషేధించింది. ప్రభుత్వ వైద్యులు కనీసం నిర్ణీత వేళలలోనన్నా ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తుంటే కాలక్రమంలోనన్నా సర్కార్ వైద్యంపై ప్రజలకు నమ్మకం పెరుగుతుంది.




# పెన్నాకు నీళ్లొచ్చాయోచ్...

2015లో వచ్చిన వర్షాలు, వరదలకు తప్పితే తర్వాత పెన్నా నదిలో నీళ్ళు పారింది లేదు. గత నాలుగేళ్లుగా ఎలాంటి వర్షాలు లేక నెల్లూరు నగర పరిధిలోవున్న పెన్నానది ప్రాంతం ఒక ఎడారిని తలపిస్తుండేది. ముఖ్యంగా రైల్వే, రోడ్డు వంతెనల క్రింద ప్రాంతంలో అయితే నెల్లూరులో వున్న చెత్త అంతా పోస్తున్నారు. అసలు పెన్నానది రూపురేఖలే పూర్తిగా మారిపోయాయి. పెన్నా ఆనకట్ట వద్ద అయితే పూర్తిగా నీళ్ళు అడుగంటిన పరిస్థితి. ఆనకట్ట వద్ద నీళ్ళు లేకుంటే నగరంలో చాలా ప్రాంతాలలో భూగర్భ జలాలు కూడా అడుగంటి పోతుంటాయి. ఒకప్పుడు మైపాడురోడ్డు, నవాబుపేట, కిసాన్‌నగర్, నవలాకుతలతోట వంటి ప్రాంతాలలో బోరు వేస్తేనే నీళ్ళు పడేవి. అలాంటి ప్రాంతాలలో ఇప్పుడు వంద అడుగులపైనే బోర్లు వేసినా నీళ్ళు పడడం లేదు. పెన్నా ఆనకట్ట వద్ద నీళ్ళు లేకుంటే నగరంలోని చాలా ప్రాంతాలలో తలెత్తే నీటి సమస్యలివి.



అయితే అనుకోకుండా పెన్నా ఆనకట్ట వద్దకు నీళ్ళు చేరాయి. సోమశిలకు వచ్చిన వరద ప్రవాహంతో పెన్నకు నీళ్ల వదలడం అయితేనేమీ, ఇటీవల అక్కడక్కడా కురిసిన వర్షాల వల్లయితేనేమీ ఆనకట్ట వద్ద నీటి పరిమాణం పెరిగింది. దీనికితోడు సోమశిల నుండే నెల్లూరు చెరువుకు కూడా నీళ్ళు వదలడంతో చెరువు నీటి మట్టం పెరిగింది. అటు బ్యారేజీ వద్ద, ఇటు చెరువు వద్ద ఒక మోస్తరుగా నీటి మట్టం వుండడంతో నగరంలో భూగర్భ జలాలు కొంతవరకు పెరిగి తాగునీటి ఇబ్బందులు తీరాయి.

# లక్షలు ఖర్చైనా... లక్ష్యం నెరవేరలేదు!

ప్రజల సొమ్ముతో ప్రభుత్వాలు చేసే కొన్ని పనులు చూస్తుంటే... అవి ఎందుకోసం ఎవరి కోసం చేస్తున్నారో కూడా అర్థం కాకుండా వుంటుంది. కోట్లు ఖర్చుపెట్టి చేసే పనులు చివరకు దేనికీ ఉపయోగపడకుండా వుంటున్నాయి. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆత్మకూరు బస్టాండ్ వద్ద సర్వేపల్లి కాలువపై పాత వంతెనల పక్కనే రెండు కొత్త వంతెనలు నిర్మించారు. వంతెనలకు తగ్గట్లుగా రోడ్డును వెడల్పు చేసుంటే ఈ వంతెనలు కట్టినందుకు ఉపయోగముండేది. స్టోన్ హౌస్‌పేట రోడ్డులో ట్రాఫిక్ సమస్య కొంత తగ్గి వుండేది. కాని అలా జరగలేదు. ఇప్పుడు రెండు వంతెనలు హాకర్లకు, ఆటో వాలాలకు అడ్డాలుగా మారిపోయాయి.



దండగగా మారిన ఫుట్‌పాత్‌లు

అలాగే గత ప్రభుత్వం చివరి నెలల్లో మున్సిపల్ మంత్రిగా వున్న నారాయణ నగరంలో చిల్డ్రన్స్ పార్క్ రోడ్డులో, మినీబైపాస్‌రోడ్డులో ఆనం వెంకురెడ్డి బొమ్మ జంక్షన్ నుండి పూలే బొమ్మ వరకు ఫుట్‌పాత్‌లు కట్టించారు. ఈ రోడ్లలో నడిచే పాదచారుల సౌకర్యార్థం వీటిని నిర్మించారు. అయితే పాదచారులెవరూ ఫుట్‌పాత్‌మీద నడవడం లేదు. వాళ్ళు నడవడానికి అవి ఇప్పుడు ఖాళీగా లేవు. మినీబైపాస్ రోడ్డు మొత్తం కమర్షియల్ రోడ్డుగా మారడంతో ఇక్కడ వ్యాపార సంస్థలు షాపుల ముందు ఒక్క అడుగు ఖాళీ వున్నా వదిలిపెట్టరు. ఇక వీరి షాపుల ముందు ఫుట్‌పాత్‌లు ఏం ఉపయోగపడతాయి. ఈ ఫుట్‌పాత్‌లకు బదులుగా నగరంలోని ప్రధాన కూడళ్ళలో అండర్‌పాస్‌లు నిర్మించివున్నా నగరానికి ట్రాఫిక్ బాధలన్నా తప్పేవి.



## పిగ్‌ఫ్రీ సిటీ అవుతుందా?

ఒకప్పుడు నెల్లూరు నగరానికి పందుల గుంపులు అలంకారప్రాయంగా వుండేవి. నగరంలోనే ఖరీదైన ప్రాంతంగా వున్న మాగుంట లే అవుట్ రోడ్లల్లో కూడా పందులు బ్యాచ్‌లు బ్యాచ్‌లుగా తిరుగుతుండేవి. వీటి సంరక్షణ కేంద్రాలు కూడా చుట్టు పక్కలే వుండేవి. జనాలతో పాటు అవి కూడా కలిసి జీవిస్తుండేవి. గత కౌన్సిల్ హయాంలో కొంతమేరకు పందుల నిర్మూలన జరిగింది. పందులను దూరంగా తరలించడం, లేకుంటే కాల్చేయడం చేశారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నగర ఎమ్మెల్యేగా వున్న పి.అనిల్‌కుమార్‌యాదవ్ కూడా నగరంలో పందుల సంచారంపై సీరియస్‌గా స్పందించాడు. పందులు కనిపిస్తే ఒప్పుకునేది లేదని కార్పొరేషన్ అధికారులకు గట్టిగా చెప్పాడు. దాని ఫలితమేనేమో నగరంలో ఎక్కడ పందులు కనిపించినా కార్పొరేషన్ వాళ్ళు తరిమి తరిమి కాల్చి పడేస్తున్నారు. కార్పొరేషన్ వాళ్ళు ఇలాగే పనిచేస్తే నెల్లూరు త్వరలోనే 'పిగ్ ఫ్రీ సిటీ'గా మారడం ఖాయం.

## బాధ్యతలు తీసుకున్న వినోద్ కుమార్

జిల్లా జాయింట్ కలెక్టర్‌గా వినోద్‌కుమార్ ఈ నెల 20వ తేదీన తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. విజయ నగరం జిల్లా పార్వతీపురం ఐటిడిఏ పి.ఓగా పని చేస్తూ బదిలీపై ఆయన జిల్లాకు జేసీగా రావడం తెలిసిందే! జేసీగా బాధ్యతలు తీసుకున్న వినోద్‌కుమార్‌ను వివిధ శాఖల అధికారులు కలిసి అభినందనలు తెలిపారు.

## సిపిఓగా సురేష్

జిల్లా ముఖ్య ప్రణాళికాధికారిగా టి.సురేష్‌కుమార్ 24వ తేదీ నెల్లూరులోని తన కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా సిపిఓగా పనిచేస్తూ ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు.

## నెల్లూరు కార్పొరేషన్ ఇన్‌ఛార్జి మేనేజర్‌గా రాజేశ్వరి

నెల్లూరు నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి మేనేజర్‌గా రాజేశ్వరి ఈనెల 23న బాధ్యతలు చేపట్టారు. రెవెన్యూ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఆమెను కమిషనర్ పీవీవీయస్ మూర్తి మేనేజర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మేనేజర్‌గా పనిచేస్తున్న గిరిజ ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందారు. ఈ క్రమంలో రాజేశ్వరిని ఇన్‌చార్జి మేనేజర్‌గా నియమిస్తూ కమిషనర్ నిర్ణయం తీసుకున్నారు.

# త్వరలో రంగనాథస్వామి ఘాట్ పూర్తి

- మంత్రి పి.అనిల్



ఈ నెల 20వ తేదీన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్ యాదవ్ నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంకు విచ్చేశాడు. దేవాదాయశాఖ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, ఇ.ఓ వేమూరి గోపి, ఆలయ ప్రధానార్చకులు జగన్నాధాచార్యులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లను దర్శించుకుని మంత్రి పూజలు నిర్వహించాడు. అనంతరం పెన్నానది ఒడ్డున నిర్మిస్తున్న రంగనాథస్వామి ఘాట్‌ను పరిశీలించాడు. కార్తీక మాసంలోగా ఈ ఘాట్ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చాడు.



## చెత్త సేకరణలో బ్యాటరీ ఆటోలు

ఇటు పర్యావరణ పరిరక్షణ, అటు పరిశుభ్రత... రెండు విషయాలు కలిసొచ్చేలా నెల్లూరు నగరపాలక సంస్థ వాళ్ళు నగరంలో చెత్త సేకరణకు బ్యాటరీ ఆటోలను ఉపయోగిస్తున్నారు. నగరపాలక సంస్థలో 54డివిజన్‌లుండగా మొత్తం 32 బ్యాటరీ వాహనాలను వాడుతున్నారు. ఈ బ్యాటరీ ఆటోలు పెద్దపెద్ద చెత్త వాహనాలు వెళ్లలేని వీధుల్లోకి కూడా వెళతాయి. బండి అతను వీధిలోకి పోయి విజిల్ ఊదుతాడు. చెత్తబండి వచ్చిందనడానికి అదే సిగ్నల్. ఇళ్లల్లో వాళ్ళు విజిల్ శబ్ధం రాగానే ఇంట్లో చెత్తను తెచ్చి ఈ బండ్లలో పోస్తున్నారు. చిన్న చిన్న వీధుల్లోకి ఇలాంటి వాహనాలు నడపడం వల్ల వీధులు శుభ్రంగా వుంటాయి. బ్యాటరీ వాహనాలు వాడడం వల్ల కాలుష్యం తగ్గుతుంది. ఇప్పటికే అధికారుల కోసం బ్యాటరీ కార్లు కొన్న నగరపాలక సంస్థ చెత్త సేకరణకు కూడా బ్యాటరీ బండ్లనే ఉపయోగిస్తుండడం అభినందనీయం.

## జడ్పీ ఇన్‌ఛార్జి సిఇఓగా బాధ్యతలు స్వీకరించిన బాపిరెడ్డి

జిల్లా పరిషత్ ఇన్‌చార్జి సిఇఓగా సుడా వైస్‌ఛైర్మెన్ బాపిరెడ్డి నియమితులయ్యారు. ఆ మేరకు కలెక్టర్ ఎం.శేషగిరిబాబు ఈ నియామకం చేయడంతో బాపిరెడ్డి ఈనెల 21న బాధ్యతలు చేపట్టారు. ఈ స్థానంలో పనిచేస్తున్న సుధాకర్‌రెడ్డి నెలరోజుల పాటు సెలవు పెట్టడంతో, ఇన్‌చార్జిగా బాపిరెడ్డి నియామకం జరిగింది. ఈ సందర్భంగా బాపిరెడ్డి మాట్లాడుతూ పారదర్శకంగా పాలన సాగిస్తానని, సచివాలయ ఉద్యోగ నియామకాలు, ఉద్యోగుల సమస్యలకు సంబంధించి విషయాల్లో నిబంధనల మేరకు వ్యవహరిస్తామని చెప్పారు.

## హోర్డింగ్‌ల తొలగింపు

నెల్లూరు నగర పరిధిలో కార్పొరేషన్ స్థలాలలో అక్రమ నిర్మాణాలను, అనుమతుల్లేకుండా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను సిటీ ప్లానింగ్ అధికారులు ఇటీవల తొలగించారు. నగరం నిండా అనుమతుల్లేని హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు చెత్తచెత్తగా వున్నాయి. ఎవరు పడితే వాళ్ళు ఫ్లెక్సీలతో అలికేస్తున్నారు. లైసెన్స్ వున్న హోర్డింగ్‌ల మీదే ఫ్లెక్సీలు వేసేలా నగరపాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టాలి.

## అసెంబ్లీలో... అమరజీవి విగ్రహాన్ని పెట్టాలి

ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఆవరణలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని పెట్టాలని అంతర్జాతీయ ఆర్యవైశ్య సమాఖ్య ఉపాధ్యక్షుడు కె.వి.చలమయ్య రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతిని కోరాడు. ఈ నెల 24వ తేదీన నెల్లూరు ఆర్&బి గెస్ట్‌హౌస్‌లో వున్న కోన రఘుపతిని చలమయ్య కలిసి ఈ విషయమై వినతిపత్రం సమర్పించాడు. ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు కోసం శ్రీ పొట్టిశ్రీరాములు చేసిన త్యాగానికి గుర్తుగా ఆయన విగ్రహాన్ని పెట్టడం సముచితంగా ఉంటుందని పేర్కొన్నాడు. ఈ సందర్భంగా కోన రఘుపతిని చలమయ్య శాలువాతో సత్కరించాడు.



## ఆత్మహత్యలు మానండి...

# మీ ప్రాణం మీది కాదు

### విద్యార్థి లోకానికి యస్.పి.బాలు హితవు



వివిధ కంపెనీలలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థినీవిద్యార్థులను అభినందిస్తున్న యస్.పి.బాలు

మీ ప్రాణం మీది కాదని, మిమ్మల్ని నవమాసాలూ మోసి మీకు జన్మనిచ్చి తాను పునర్జన్మను పొందే మీ తల్లికి, చిన్ననాటి నుండి మిమ్మల్ని వేలుపట్టుకుని నడిపించిన మీ తండ్రికి మాత్రమే మీ ప్రాణాలపై హక్కు వుందని భారతీయ సినిమా గాయకులు యస్.పి.బాలసుబ్రహ్మణ్యం హితవు పలికారు.

శ్రీ వేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో చదివి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించిన 80మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులను ఆయన మంగళవారం నెల్లూరులో జరిగిన ఓ కార్యక్రమంలో అభినందించారు. కార్యక్రమానికి ప్రధాన అతిథిగా పాల్గొన్న బాలు నేటి యువతరం సామాజిక మాధ్యమాలకు బానిసలుగా మారి సమాజంలో ప్రేమానురాగాలకు దూరమైపోతున్నారని, సామాజిక మాధ్యమాల ప్రభావంతో అనవసరంగా ప్రాణాలు సైతం తీసుకోవడం చూస్తే బాధ కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

అమెరికాలో జరిగిన 'హౌడీ మోడీ' కార్యక్రమంలో మన భారత ప్రధాని నరేంద్ర మోడీకి లభించిన ఆదరణ, గౌరవం చూస్తే కొన్ని దశాబ్దాల తరువాత మన దేశానికి ఓ సమర్థవంతమైన వ్యక్తి ప్రధానిగా వచ్చాడని అనిపిస్తుందని, భారతదేశాన్ని అగ్రభాగాన నిలపడానికి, అన్ని రంగాలలో భారత్‌ను పురోగమనం వైపు తీసుకెళ్లడానికి నరేంద్ర మోడీ చేస్తున్న శ్రమ, పడుతున్న తపన అమోఘమని అన్నారు. తాను ఏ పార్టీకి చెందిన వాడిని కాదని, మంచి ఎవరు చేసినా కీర్తిస్తానని చెప్పాడు.

అమెరికా అధ్యక్షుడిని చేయి పట్టుకుని తీసుకెళ్లిమరీ 60వేలమందికిపైగా పాల్గొన్న సభలో అందరికీ అభివాదం చేయడం అభినందనీయమని అన్నారు. ప్రతిఒక్కరు తప్పనిసరిగా స్వచ్ఛభారత్‌ను పాటించాలని, అలాగే "డ్రావ్‌డెడ్" ఫౌండేషన్ వ్యవస్థాపకులు 'ఆబిద్ సూర్తి' ఆదర్శంగా ఒక్క చుక్క కూడా నీటిని వృధాకానీయకుండా కాపాడుకోవాలని సూచించాడు.

విద్యార్థినీ విద్యార్థుల చేత నిర్వహించబడిన సాంస్కృతిక కార్యక్రమాలను బాలసుబ్రహ్మణ్యం తిలకించారు. ఉద్యోగాలు పొందిన బాలబాలికలతో పాటు వారి తల్లితండ్రులు, కళాశాల ఛైర్మన్ బాబునాయుడు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్, తుంగా శివప్రభాత్‌రెడ్డి తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు.



## కిలివేటి చొరవతో...

# ఇరకం పిల్లలకు తీరిన ఇక్కట్లు



తడ మండలంలోని ఇరకం దీవి... చుట్టూ నీళ్ళు... ఆ ఊరి నుండి బయటకు రావాలంటే పడవలే దిక్కు. పులికాట్ సరస్సులో ప్రయాణం. వివిధ వ్యాపారాలు, పనుల నిమిత్తం పెద్దోళ్ళు పడవల్లో వస్తూ పోతుండడం పరిపాటి. మరి చదువుకునే విద్యార్థుల సంగతి. వాళ్ళు కూడా ఉదయం పడవల్లో తడ, ఇతర గ్రామాల్లోకి పాఠశాలలకు వచ్చి సాయంత్రం తిరిగి పడవల్లో ఇరకంకు వెళ్లాలి. ప్రతిరోజూ నాటుపడవలే దిక్కు. పులికాట్‌లో పడవ ప్రయాణాలు పెద్దగా ప్రమాదం కాకపోయినా ఏరోజు ఎలా వుంటుందో చెప్పలేం కదా! ముఖ్యంగా భారీ వర్షాల సమయంలో అయితే ఇరకం నుండి పాఠశాలలకు వెళ్లడానికి వుండదు. ఒకవేళ వెళ్లినా వర్షాలు ఎక్కువై ఆ పాఠశాలలు వున్న గ్రామాలలోనే రాత్రిళ్ళు వుండిపోవాల్సిన పరిస్థితి. ఇంతకాలం ఇరకంను అధికారులు, ప్రజాప్రతినిధులు ఒక పర్యాటక కేంద్రంగా చూస్తూ వచ్చారేగాని, అక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పూర్తి స్థాయిలో దృష్టిపెట్టలేదు.

ప్రస్తుత ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఈ సమస్యపై దృష్టి పెట్టాడు. అక్కడ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాడు. గోదావరి బోటు ప్రమాదం నేపథ్యంలో కలెక్టర్ శేషగిరి బాబు ఈ సమస్యపై వేగంగా స్పందించారు. ముందుగా లైసెన్స్ వున్న బోట్ల ద్వారానే పిల్లలు ప్రయాణించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఇరకంలోనే విద్యావాలంటీర్లను నియమించి అక్కడే పిల్లలకు ప్రాథమిక విద్యనందించేలా చర్యలు తీసుకున్నారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


# జ్వరాలపై జాగ్రత్తపడదాం

### - అధికారులు, ప్రైవేట్ వైద్యులతో కలెక్టర్



జిల్లాలో విషజ్వరాలు వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు పేర్కొన్నారు. 22వ తేదీ ఆయన తన క్యాంప్ కార్యాలయంలో ప్రైవేట్ వైద్యులు మరియు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. విషజ్వరాలు ప్రబలకుండా నివారణ చర్యలపై దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో వర్షాలు పడుతున్నాయి. మురికి గుంటల్లో నీళ్ళు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతాయి. ఇవి కుట్టడం వల్లే విషజ్వరాలు ప్రబలుతున్నాయి. అధికారులు ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రుల నుండి జ్వరపీడితుల జాబితాను తెప్పించుకోవాలి. ఏ ప్రాంతంలో ఎక్కువ కేసులు న్నాయో చూసుకోవాలి. ఆ ప్రాంతాలలో వైద్య శిబిరాలు నిర్వహించాలి. అక్కడి ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి విషజ్వరాలు ప్రబలకుండా నిరోధించాలి. అదనపు వైద్యాధికారి నుండి ఆశా వర్కర్ వరకు ప్రతిఒక్కరూ ఇంటింటికి తిరిగి విషజ్వరాలపై సర్వే నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. కావలి చుట్టుపక్కల ప్రాంతాలలో విషజ్వరాలు ఎక్కువగా వున్నాయనే సమాచారం వుందని, ఆ ప్రాంతాలపై అధికారులు దృష్టిపెట్టాలని ఆయన ఆదేశించారు. అలాగే విషజ్వర పీడితులకు రాయితీపై వైద్య చికిత్స అందించేందుకు కలెక్టర్ ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలతోనూ అక్కడే మాట్లాడి ఒప్పించారు.

ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి, అపోలో, సింహపురి, నారాయణ, జయభారత్ ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.




# చెరువులను నింపితే కరువు తీరుతుంది

నెల్లూరుజిల్లాలో ఇంతవరకు భారీ వర్షాలు లేకున్నా ప్రకృతి కరుణతో పైరాష్ట్రాలు, ఎగువ జిల్లాల్లో కురిసిన వర్షాలు, వరదల మూలంగా సోమశిల రిజర్వాయర్‌లో పూర్తి సామర్థ్యంలో నీళ్లొచ్చాయి. అయితే వచ్చిన నీళ్లను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునే దిశగా ఇరిగేషన్ అధికారులు ప్రణాళికలు రూపొందించాలి. జిల్లా మంత్రిగా, ఇరిగేషన్ మంత్రిగా పి.అనిల్‌కుమార్‌యాదవ్ దీనిని పర్యవేక్షించాలి. అక్టోబర్, నవంబర్ నెలల్లో వీలైతే, డిసెంబర్ నెలలో కూడా వర్షాలకు అవకాశం వుంటుంది. కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో మరోసారి భారీవర్షాలు కురిస్తే పెన్నానదికి వరద రావొచ్చు. సోమశిల ఇంకోసారి నిండొచ్చు. కాబట్టి ఇప్పుడు సోమశిలకు వచ్చిన నీటిని పూర్తిస్థాయిలో ఏ విధంగా వినియోగించాలనే దానిపై దృష్టిపెట్టాలి.

రాబోయే రెండు నెలల్లో జిల్లాలో భారీవర్షాలు కురిసినా కూడా నిండని చెరువులు చాలావున్నాయి. ముందు సోమశిల నీటిని వాటికి తరలించాల్సివుంది. కండ్లేరు రిజర్వాయర్‌తో పాటు కనిగిరి, సర్వేపల్లి, అనంతసాగరం, కనుపూరు వంటి పెద్ద చెరువులను, అలాగే ఉత్తర కాలువ, కావలి కాలువ క్రింద వున్న చెరువులను కూడా నీటితో నింపి మెట్ట ప్రాంత రైతులకు సాగునీటి కొరత తీర్చాల్సివుంది.





## ఐ క్రాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో
# ఉచిత వైద్యపరీక్షలు

కోట మండలంలోని విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ఐక్రాస్ ఫౌండేషన్ సభ్యులు ఈనెల 22న సైదాపురం మండలంలోని చీకవోలు గ్రామస్తులకు వైద్యపరీక్షలు, నేత్రపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసులు సుమారు 140 మందికి నేత్రపరీక్షలు, డాక్టర్ ఖాదర్‌బాషా 85 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ప్రసన్న జ్యోతి ఆధ్వర్యంలో మరో 85మంది మహిళలకు వైద్యపరీక్షలు చేశారు. గ్రామస్తులకు ఆరోగ్యం పట్ల, పరిశుభ్రత పట్ల అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఇసిఎఫ్ సభ్యులు వారికి సహకరించినందుకు గ్రామస్తులకి, విజయభాస్కర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటి ఛైర్మెన్ ధీరజ్, సభ్యులు లక్ష్మీప్రసన్న, కుమార్, సునీల్, పవన్, భార్గవి, యామిని తదితర సభ్యులు మాట్లాడుతూ కళాశాల డైరెక్టర్ డా.వి.విజయ కుమార్‌రెడ్డి, ఇసిఎఫ్ ఫ్యాకల్టీ ఇన్‌చార్జి ఏ. రాజశేఖర్‌ల ప్రోత్సాహంతో ఇంకా మరెన్నో సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించినందుకు కళాశాల యాజమాన్యానికి, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉద్యోగుల సమస్యల
# పరిష్కారానికి కృషి

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 23న కావలి పట్టణం ఆర్ అండ్ బీ అతిథి గృహంలో కావలి డివిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డివిజన్ అధ్యక్షుడు శివకుమార్ పర్యవేక్షణలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఉద్యోగుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి రాష్ట్ర అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం దృష్టికి ఉద్యోగుల సమస్యలను తీసుకెళ్ళామన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. ఏపీ ఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి బండి శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.గంగిరెడ్డి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి అజయ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి కృపావరం, జిల్లా అధ్యక్షుడు శేఖర్‌రావు, కార్యదర్శి రమణారెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఆంజనేయశర్మ, ఉద్యోగులు పాల్గొన్నారు.



## షిరిడీలో శ్రీ సాయిదర్బార్ భక్తులచే
# పల్లకీ ఉత్సవం

### పులకించిన షిరిడీ నగర వీధులు..

శ్రీ సాయినాథుని పరిపూర్ణ అనుగ్రహంతో నెల్లూరు బాలాజీనగర్ చివర పద్మావతి నగర్‌లోని శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరం నుండి ఈనెల 15న దాదాపు 400 మంది భక్తులు షిరిడీ యాత్రకు వెళ్ళారు. షిరిడీలో ఈనెల 18న సాయిబాబా స్వయంగా నడయాడిన పురవీధుల్లో సాయిదర్బార్ మేనేజింగ్ ట్రస్టీ మధుసూదనసాయి ఆధ్వర్యంలో బాబావారి పల్లకీ ఉత్సవం అంగరంగవైభవంగా జరిగింది. శ్రీ సాయినామ సంకీర్తనలతో సాయిమాల ధరించిన స్వాముల ఇరుముడులతో, షిరిడీ బ్యాండ్ వాయిద్యాలతో, ఒంటెల, గుర్రాల పదరవళులతో, భక్తుల పండరి భజనలు, కోలాటాలు, నృత్యాలతో శ్రీ సాయిదర్బార్ పల్లకీ ఉత్సవం చావడి, ద్వారకామాయి మీదుగా ఖండోబా దేవాలయానికి చేరుకుంది. అక్కడ వీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించి, గురుస్థాన్ సాయినాధుని దర్శించుకుని అనంతరం భక్తులు బాబావారి మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ మహాకార్యానికి ప్రకృతి కూడా సహకరించి చిరుజల్లులు కురియడంతో భక్తులు పరవశించిపోయారు. ఈనెల 22న సాయి భక్తులు నెల్లూరు చేరుకున్నారు.



# గూడూరు డివిజన్ వార్తలు

## ధూర్జటి నగర్‌లో సిసిరోడ్డుకి శంకుస్థాపన



సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

గూడూరు పట్టణంలోని నాల్గవ వార్డు ప్రాంతంలో ఉన్న ధూర్జటి నగర్‌లో 5లక్షల రూపాయల వ్యయంతో సిసిరోడ్డు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి ఈనెల 23న గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడూరు పట్టణాభివృద్ధికి అన్ని విధాల కృషిచేస్తామన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల పరిధిలో సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణాలు ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గూడూరును గ్రేడ్-1 మునిసిపాలిటీగా అభివృద్ధిచేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఆయన ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఓబులేశు, వైకాపా నాయకులు బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయకుమార్‌రెడ్డి, గిరిబాబు, తాళ్ళూరు శ్రీనివాసులు, బాలయ్య, సతీష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వినీష్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

### - సిఐ దశరధరామారావు



తనిఖీలు నిర్వహిస్తున్న సిఐ దశరధరామారావు

ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠినచర్యలు తప్పవని గూడూరు పట్టణ సిఐ దశరధరామారావు హెచ్చరించారు. గూడూరు రెండవ పట్టణంలోని గూడూరు-వెంకటగిరి ప్రధాన రహదారిపై రెండవ పట్టణ ఎస్ఐ ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నెంబర్ ప్లేట్ లేని, సరైన పత్రాలు లేని వాహనాల యజమానులకు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

## చిన్నారులకు
# ఉచిత చెస్ శిక్షణా శిబిరం




మాట్లాడుతున్న శ్రీకంటి రామ్మోహన్‌రావు, భాస్కర్‌రావు తదితరులు

గూడూరు పట్టణంలోని కాస్మోపాలిటన్ క్లబ్‌లో చిన్నారులకు ఉచిత చెస్ శిక్షణ శిబిరాన్ని నిర్వాహకులు యరగుడిపాటి భాస్కర్ రావు, ప్రముఖ సీనియర్ ఆడిటర్ శ్రీకంటి రామ్మోహన్‌రావుల ఆధ్వర్యంలో ఈనెల 22న ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల కూడా ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. చెస్ ఆడడం ద్వారా చిన్నారుల్లో మేథోశక్తి పెరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రతినిధులు రత్నాకర్‌రెడ్డి, వి.ఆచారి, సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు బ్రాహ్మణ సంఘం సత్కారం



ఎమ్మెల్యే వరప్రసాద్‌ను సన్మానిస్తున్న రామ్మోహన్‌రావు, శివకుమార్

గూడూరు ఎమ్మెల్యే వి.వరప్రసాదరావు జన్మదినాన్ని పురస్కరించుకుని ఇటీవల ఆయనను రాష్ట్ర బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య గౌరవాధ్యక్షుడు, ప్రముఖ సీనియర్ ఆడిటర్ శ్రీకంటి రామ్మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు ఆనివెళ్ళ శివకుమార్‌లు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని కొనియాడారు.

## విస్తృతంగా 'లయన్స్' సేవలు



సిమెంటు బెంచీలు ప్రారంభిస్తున్న లయన్స్ ప్రతినిధులు

గూడూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దాతలు యేల్చూరి వెంకటేశ్వరరావు, మాధవీలత దాతృత్వంతో ఇటీవల గూడూరు పాతబస్టాండ్‌లోని కారుస్టాండ్‌లోను, కోర్టుసెంటర్‌లోను సిమెంటు బెంచీలు ఏర్పాటుచేసి ప్రజలకు సౌకర్యం కల్పించారు.

ఈ కార్యక్రమంలో యేల్చూరి వెంకటేశ్వరరావుతో పాటు, మోడిబోయిన సుబ్రహ్మణ్యం, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జి.చంద్రశేఖర్, కార్యదర్శి కడివేటి చంద్రశేఖర్, మదనమేటి రమణయ్య, వాకాటి రామ్మోహన్, మేకల మస్తానయ్య, కాటూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు చేయూత



వృద్ధులకు కేక్‌ను పంచిపెడుతున్న సాయిరాం ఛారిటీస్ ప్రతినిధులు

గూడూరు పట్టణంలోని సాయిరాం ఛారిటీస్ వృద్ధాశ్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు పనబాక కృష్ణయ్య జన్మదిన వేడుకలను మంగళవారం మైనార్టీ నాయకుడు జహంగీర్, ఆయన అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్‌ను కట్ చేసి వృద్ధులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పనబాక అభిమానులు దువ్వూరు రవీంద్రరెడ్డి, ఉడతా శరత్‌యాదవ్, అన్వర్‌భాషా, కార్తీక్, వెంకటేష్, అనీల్, చందుయాదవ్, అశీం తదితరులు పాల్గొన్నారు.

# శరణాగతితోనే దైవానుగ్రహం

## - ఘనంగా మాస్టర్ సివివి 150వ జయంతి

శరణాగతి తత్వంతోనే మానవులకు దైవానుగ్రహం ప్రాప్తిస్తుందని, గజేంద్ర మోక్షంలో గజేంద్రుడు శరణాగతి మార్గంలోనే ఆ భగవంతుని అనుగ్రహాన్ని పొందగలిగాడని ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ అన్నారు.

సుప్రసిద్ధ యోగా మాస్టర్ సివివి గారి 150వ జయంతి, గురుపూజోత్సవం సందర్భంగా ఈనెల 22న నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీరంగనాధస్వామి కల్యాణమండపంలో జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆయన పాల్గొని పోతన మహాకవి రచించిన 'గజేంద్రమోక్షం' ఘట్టాన్ని భక్తులకు విశదీకరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా భగవన్నామ సంకీర్తన, లలితా సహస్రనామపూజలతో పాటు శాస్త్రీయ సంగీత, నృత్య కార్యక్రమాలు జరిగాయి.

శ్రీమాన్ ఎక్కిరాల అనంతకృష్ణ ఆశీస్సులతో ఎంతో భక్తిప్రపత్తులతో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్తలు లంకా విజయసారధి, కవిరాజు అచ్యుతరామారావు, ఐనవోలు చక్రపాణి, పిఎస్ఆర్ ఆంజనేయులు, పంచాగ్నుల దయాళ్‌దాసు తదితరులు పాల్గొని భగవద్భక్తిని, భగవత్‌శక్తిని గురించి భక్తులకు వివరించారు. అనంతరం ఉపన్యాసకులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.



'గజేంద్రమోక్షం' ఘట్టాన్ని విశదీకరిస్తున్న అవధాని కోట రాజశేఖర్

### కోడూరు తీరంలో

# 'కోస్టల్ క్లీనప్ డే'

'కోస్టల్ క్లీనప్ డే' ఉత్సవాల్లో భాగంగా కృష్ణపట్నం ఇండియన్ కోస్ట్‌గార్డ్స్ అధికారులు ఈ నెల 21న కోడూరు తీరంలో పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. కోస్ట్‌గార్డ్స్ సిబ్బందితో పాటు, పోర్ట్ అధికారులు, ఎన్‌సిసి క్యాడెట్లతో పాటు సుమారు 200 మంది స్థానిక కళాశాల విద్యార్థులతో కలసి తీరంలో ఈ కార్యక్రమాలను చేపట్టారు. సముద్రతీరం పొడవునా సుమారు రెండు కిలోమీటర్ల దాకా ఉన్న చెత్తా చెదారాలన్నిటినీ తొలగించి కోడూరు బీచ్‌ను పరిశుభ్రం చేశారు. కోస్ట్‌గార్డ్స్ కమాండెంట్ నవదీప్ సహాయ్, కెఎస్‌పిఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఐ మనోజ్ కుమార్, కోడూరు వేళాంగణిమాత చర్చి డైరెక్టర్ ఫాదర్ అగస్టీన్ పాల్గొన్నారు.

# వడ్డెర సంఘం కొత్త కార్యవర్గం

ఏపి వడ్డెర సంక్షేమ సంఘం జిల్లాశాఖ నూతన కార్యవర్గాన్ని ఈనెల 21న నగరంలోని పడారుపల్లిలో ఉన్న ఏఎన్ఆర్ కల్యాణమండపంలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షునిగా మహేష్, కార్యదర్శిగా నరసింహులు, ఉపాధ్యక్షునిగా నరేష్ ఎన్నియ్యారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకులు ఆంజనేయులు, వల్లెపు ముసలయ్య, కోటయ్య, మహిళా అధ్యక్షురాలు కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

### జాబ్‌మేళాలో 56 మంది..

# ఆదిత్య విద్యార్థుల ఎంపిక



హైదరాబాద్‌లోని ఎల్‌విఎస్ టెక్నాలజీస్ సంస్థ వారు నిరుద్యోగ యువతీయువకులకు నెల్లూరులోని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఈనెల 20న జాబ్‌మేళా నిర్వహించగా మొత్తం 110 మంది విద్యార్థులు పాల్గొనగా 56 మంది ఎంపికయ్యారని ఆదిత్య డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డి.పుల్లయ్య తెలియజేశారు. ఎంపికైనవారికి కంపెనీవారు నేరుగా నియామక పత్రాలు పంపిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌విఎస్ టెక్నాలజీస్ మేనేజర్ అర్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ ఆచార్య ఆదిత్య, డైరెక్టర్ మంచికంటి కృష్ణారెడ్డి అభినందించారు.

# ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఈనెల 21న మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విఎస్‌యు రిజిస్ట్రార్ ఆర్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ అందే ప్రసాద్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ అల్లం ఉదయశంకర్ పాల్గొని రక్తదానం విశిష్టతను తెలియజేశారు. అనంతరం కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ విద్యార్థులు 30మంది రక్తదానం చేశారు. వైస్‌ఛాన్సలర్ సుదర్శనరావు వీరికి ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఆదిత్య కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె. అంకయ్య, గోనెల సునీల్, కార్తీక్‌వర్మ, పోట్లూరు మహీధర్ తదితరులు పాల్గొన్నారు.

# 'హౌడీ మోడీ' సభలో చంద్రబాబు కోసం నినాదాలు

శ్రీను గల్పిక

అది హైటెక్‌రత్న చంద్రబాబు నాయుడు ప్రపంచంలోని పాతిక మేటి సిటీలను మిక్సీలో వేసి తిప్పి తీస్తే వచ్చిన అమరావతి నగరం. ఉండవల్లిలోని కృష్ణానది కరకట్ట మీద చంద్రబాబు అక్రమ నివాసం. ఇంటి వద్ద రెండు పెద్ద లారీలకు మంచాలు, కంచాలు, సోఫాలు, గిన్నెలు, పరువులు, ఫ్రిజ్‌లు, బీరువాలు వంటి సామాన్లను ఎత్తుతున్నారు. చంద్రబాబు, భువనేశ్వరీదేవి, లోకేష్‌లు లోపల నుండి సామాన్లను మోసుకొస్తూ లారీలో వున్న కూలీలకు అందిస్తుంటే, అక్కడే కూర్చుని వున్న బ్రాహ్మణి లారీలలోకి ఎత్తుతున్న సామాన్ల లిస్టును రాసుకుంటోంది. అప్పుడే అక్కడకు దేవినేని ఉమామహేశ్వరరావు, పత్తిపాటి పుల్లారావు, ఆలపాటి రాజేంద్ర, కేసినేని నాని, జేసి దివాకర్‌రెడ్డిలు వచ్చారు. దేవినేని ఉమ ఉండి... ఏంటి సార్, ఉన్నఫళంగా చెప్పా పెట్టకుండా ఇల్లు ఖాళీ చేస్తున్నారు. కరకట్ట మీద అక్రమ కొంప అని చెప్పి ఆ జగన్ ఎక్కడ కూల్చేస్తాడోనని భయపడుతున్నారా.. అలా కూలిస్తే మంచిదే కదా సార్, మనకు సానుభూతి వస్తుంది అని అన్నాడు. అందుకు చంద్రబాబు... నేను ఇల్లు ఖాళీ చేసేది జగన్ కూలుస్తాడనే భయంతో కాదు... అర్ధరాత్రిళ్లు ఈ కృష్ణానది వరదలు ఎప్పుడు ముంచుతాయోననే భయంతో. ఈ రెండు నెలల్లోనే మూడుసార్లు వరదలు వచ్చాయి. ఇంకెన్నిసార్లు వస్తాయో చెప్పలేము. వరదలొచ్చినప్పుడల్లా ఎక్కడికి పరుగులు పెట్టేము. అందుకే శాశ్వతంగా హైదరాబాద్‌కు మకాం మారుస్తున్నాను... అని చెప్పాడు. వెంటనే అక్కడేవున్న దివాకర్‌రెడ్డి... మీరు తీసుకున్న నిర్ణయం కరెక్టే సార్. మన లాగా దరిద్రపు పాలన అయితే వర్షాలు, వరదలు వుండవు. కరకట్ట మీద ఎంత కాలమైనా హాయిగా వుండొచ్చు. కాని ఇప్పుడున్నది వై.యస్.రాజశేఖరరెడ్డి కొడుకు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి పాలన. కరువును మీరు దత్తత తీసుకుంటే, వరుణ దేవుడితో ఆ యబ్బాబిడ్డలు ఎంఓయు కుదుర్చుకున్నట్లుంది. కాబట్టే వర్షాలు దంచుతున్నాయి. ఎంతైనా మావాడి పరిపాలన సూపర్. మీరు ఇక్కడ నుండి హైదరాబాద్ వెళ్లిపోవడమే మంచిది. ఈ వర్షాలు, వరదలను చూస్తూ మనసు చంపుకుని మీరిక్కడ వుండలేరని చెప్పాడు. దివాకర్‌రెడ్డి తనను తిడుతున్నాడో, జగన్‌ను పొగుడుతున్నాడో అర్ధంకాక చంద్రబాబు బుర్ర గోక్కున్నాడు. తర్వాత లారీలలో సామాలన్నీ ఎక్కించడం పూర్తి కావడంతో అందరూ అదే లారీలో ఎక్కి హైదరాబాద్ బయలుదేరారు.

★★★★★

హైదరాబాద్‌లోని తన ఇంటిలో చంద్రబాబు అప్పుడే రెండు పుల్కాలు తిని హాల్‌లోకి వచ్చాడు. ఉదయమంతా లారీలలోకి సామాన్లు మోసి వుండడంతో ఆయన ఒళ్లంతా పులిసిపోయి కళ్లు మూతపడుతున్నాయి. అయినా పది నిముషాలు టీవీ చూసి పడుకుందామనుకుని టీవీ ఆన్‌చేసి 9×9=99 ఛానెల్ పెట్టాడు. అమెరికాలోని హ్యూస్టన్ నగరంలోని ఎన్ఆర్‌జి స్టేడియంలో జరుగుతున్న 'హౌడీ మోడీ' కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారమొస్తుంది. స్టేడియం మొత్తం జనంతో నిండిపోయింది. ప్రేక్షకులు భారత, అమెరికా జాతీయ పతాకాలను ఊపుతున్నారు. అప్పటికి మోడీ, ట్రంప్‌లు ఇంకా సభలోకి రాలేదు. ఆ సీన్‌లు చూసి చంద్రబాబు మనసులో... ఈ మోడీకి ఇంత సీనేంటి... అసలు అమెరికాలో ట్రంప్, ఒబామా, క్లింటన్‌ల కంటే నాకే ఎక్కువ ఫాలోయింగ్ వుంది కదా... అసలు అక్కడ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశమే వుంటే నేనే అధ్యక్షుడినవుతా... నాకు ఆంధ్రా కంటే అమెరికాలో గెలవడమే ఈజీ. నేను లేకుండా అమెరికాలో సభ జరగడమేంటి.. అసలు ఈ జనాలు మోడీ కోసమే వచ్చారా... ఇలా ఆలోచిస్తూ ఆ ఛానెల్ చూస్తున్నాడు.

★★★★★

అప్పుడే చంద్రబాబు సెల్‌ఫోన్ మోగింది. చంద్రబాబు ఫోన్ ఆన్ చేశాడు. అవతల నుండి మమతా బెనర్జీ. చంద్రబాబు భాయ్... అమెరికాలో మీకున్న పాపులారిటీ ఎవరికీ వుండదనుకున్నాం.. కాని, ఆ మోడీ సభకేంటి జనం అలా వచ్చారు. ఇక మీరు కామ్‌గా వుంటే కుదరదు భాయ్, మీ విశ్వరూపం చూపించాల్సిందే. అసలు మీముందు, మీ అనుభవం ముందు ఆ మోడీ ఎంత అని చెప్పి పెట్టేసింది. అంతలో పి.ఎ లోపలకు వచ్చాడు. సార్, మిమ్మల్ని కలవాలని సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, దిగ్విజయ్‌సింగ్, అరవింద్ కేజ్రీవాల్, సీతారాం ఏచూరి, సురవరం సుధాకర్‌రెడ్డి, అఖిలేష్‌యాదవ్, కుమారస్వామి, స్టాలిన్‌లు వచ్చారు. హాల్‌లో కూర్చోపెట్టాను అని చెప్పాడు. వీళ్లంతా ఈ టైంలో నా కోసం ఎందుకొచ్చారబ్బా అనుకుంటూ చంద్రబాబు తన గదిలో నుండి హాల్‌లోకి వచ్చాడు. హాల్‌లో వున్నవాళ్ళను చూసి చంద్రబాబు షాక్‌తిన్నాడు. అక్కడ తన పి.ఎ చెప్పిన నాయకులే కాకుండా వారితో పాటు పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ కూడా వున్నాడు. చంద్రబాబును చూడగానే అందరూ లేచి వినయంగా నమస్కరించారు. ఏంటి ఇలా వచ్చారని చంద్రబాబు అడిగాడు. ఆ నరేంద్ర మోడీ బారినుండి మమ్మల్నంతా మీరే కాపాడాలని సోనియా అడిగింది. చంద్రబాబు వుండి ఇమ్రాన్‌తో.. మా దేశంలోని నాయకులంటే సరే, మీకు ప్రాబ్లమేంటి అని ప్రశ్నించాడు. అందుకు ఇమ్రాన్.... ఈ దేశాన్ని కాంగ్రెస్ ఏలుతున్నంత కాలం ఏడాదికి నాలుగు దాడులు చేసుకుంటూ కాశ్మీర్ కోసం పోరాడుతున్నట్లు నటిస్తూ లాక్కొచ్చాం. ఈ మోడీ వచ్చాక ఈ దేశంలో మా ఆటలు సాగడం లేదు. కాశ్మీర్‌కు ఆర్టికల్ 370ని తొలగించాక మా దేశంలో మాపై ఒత్తిడి ఎక్కువుగా వుంది. రేపు పిఓకెను కూడా ఈ మోడీ లాగేసుకుంటాడేమోననే భయం కలుగుతోంది. అలా జరిగితే మేం మా దేశంలో వుండలేం. ఆ మోడీ హవాను ఎలాగైనా తగ్గించాలి. కాంగ్రెస్‌ను ఎలాగైనా బ్రతికించాలి. ఆ పార్టీ బ్రతికితేనే మాకు బ్రతుకు, కడుపుకు మెతుకు అని బ్రతిమలాడుకున్నాడు. ఆ తర్వాత ఏచూరి, అరవింద్ కేజ్రీవాల్, స్టాలిన్‌లు కూడా ఆ మోడీ హవాను తగ్గించకపోతే దేశంలో ఇక మనకెవరికీ మనుగడ వుండదు. మోడీని అడ్డుకునే అంతర్జాతీయ శక్తి మీ ఒక్కరికే వుంది. హ్యూస్టన్‌లో జరిగే 'హౌడీమోడీ' కార్యక్రమం సక్సెస్ అయితే మోడీ ఇమేజ్ ఎక్కడికో పోతుంది. తర్వాత ఆయనను పట్టుకోవడం కష్టమేనన్నారు. అప్పుడు వారితో చంద్రబాబు... వాస్తవంగా చూస్తే అంత ఇమేజ్ మోడీకి లేదు. నేను దేశమంతా తిరిగి ప్రచారం చేశానంటే వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించి మిమ్మల్ని గెలిపించడం పెద్ద సమస్య కాదు. నేను కంకణం కట్టుకుని రంగంలోకి దిగానంటే ఈ మోడీ నా ముందు బలాదూర్. కాకపోతే నా ఆలోచనల్లా, అమెరికాలో 'హౌడీమోడీ' కార్యక్రమానికి నేను లేకుండా అంతమంది ఎలా వచ్చారా అనేదే... అంటూ టీవీ రిమోట్ తీసుకుని ఆన్‌చేసి టీవీ 9×9=99 ఛానల్ పెట్టాడు.

స్క్రీన్‌పై 'హౌడీమోడీ' కార్యక్రమం. సభలో రసాభసా.. స్టేడియంలోని ప్రేక్షకుల చేతుల్లో పసుపు జెండాలు. వాటి మీద చంద్రబాబు బొమ్మ. స్టేడియంలో కార్యకర్తలు లేచి ఒకటే గోల. 'ఉయ్‌వాంట్ చంద్రబాబు' 'చంద్రబాబు జిందాబాద్', 'చంద్రబాబు వస్తేనే ఈ స్టేడియంలో వుంటాం'... అని నినాదాలు... వాటిని చంద్రబాబు ఆనందంతో కళ్లు పెద్దవి చేసుకుని చూస్తున్నాడు. స్టేడియంలో నుండి ఒక వ్యక్తి లేచి.... ఈ కార్యక్రమంలో వరల్డ్ గ్రేట్ లీడర్ చంద్రబాబు గారు కూడా పాల్గొంటున్నారంటేనే మేమంతా వచ్చాం. అంతేగాని, మీ చచ్చు ముఖాలు చూడడానికి కాదు. ఆయన లేకుండా ఈ కార్యక్రమం జరిపితే ఒప్పుకోం... ఆయన రావాల్సిందే అని గట్టిగా అడుగుతున్నాడు.

ఆ సీన్ చూస్తూ చంద్రబాబు ఆనందంతో.. తమ్ముడూ.. ఇప్పుడే వస్తున్నా... ఇప్పుడే బయల్దేరుతున్నా... అంటూ కేకలు పెట్టసాగాడు. అప్పుడే ఆయన ముఖం మీద చన్నీళ్లు పడ్డాయి. ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు. ఎదురుగా భువనేశ్వరీదేవి... చంద్రబాబు అయోమయంగా.. ఇమ్రాన్ ఖాన్, సోనియా, అరవింద్ కేజ్రీవాల్‌లేరి అని అడిగాడు. భువనేశ్వరీదేవి కోపంగా.. ఏం కలలు కంటున్నారా.. రాత్రి టీవీ చూస్తూ ఈ సోఫాలోనే పడుకుని నిద్రపోయారు. ఇప్పుడు నిద్దట్లో కలవరిస్తుంటే ముఖాన నీళ్లు కొట్టాను అని చెప్పింది. చంద్రబాబుకు అప్పటికి గాని అర్ధం కాలేదు అప్పటిదాకా జరిగింది కల అని!

# కళ్యాణ వైభవం...!




50 సంవత్సరాల క్రితమే ఆధునిక ఆలోచనలతో మొట్టమొదటి ఇంగ్లీష్ మీడియం స్కూలుని తన స్వంత పేరుతో జిల్లాలో నెలకొల్పిన కీ॥శే॥ స్వామిదాస్ - లిల్లీ స్వామిదాస్ గారల మనుమడు, ప్రస్తుతం స్వామిదాస్ స్కూల్‌ని నిర్వహిస్తున్న గ్రేస్ వనజ - ఆంధ్రా బ్యాంకు విశ్రాంత ఉద్యోగి ప్రసాద్‌ల కుమారుడు **శ్రావంత్ - శాంతి రాచెల్** (విశాఖపట్నం వాస్తవ్యులు శారద - భూషన్‌ల కుమార్తె)ల కళ్యాణ వేడుక సెప్టెంబర్ 23వ తేదీ నెల్లూరులో జరిగింది. నవ వధూవరులకు 'లాయర్' అభినందనలు.

## శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి

# ఉత్సవ కమిటి ప్రమాణస్వీకారం

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజ రాజేశ్వరి అమ్మవారి దేవస్థానం శరన్నవ రాత్రోత్సవాల కమిటీ ప్రమాణస్వీకారం 26వ తేదీ ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఉత్సవ కమిటి ఆర్గనైజింగ్ ఇన్‌ఛార్జ్‌గా తోట శోభారాణి, సభ్యులుగా ఏలూరు శివయ్యనాయుడు, శ్రీమతి ఆంద్రా పద్మ, జల్లికుమార్, బి.కృష్ణప్రసాద్, జి.నరేష్, మాముడూరు పెంచలప్రసాద్, కన్నేపల్లి రాజేష్‌లు ప్రమాణస్వీకారం చేశారు.

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్, నెల్లూరు పార్ల మెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు గ్రామీణ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వైసిపి నెల్లూరు రూరల్ కార్యా లయ ఇన్‌ఛార్జ్ కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఆనం విజయకుమార్‌రెడ్డి, వైసిపి నాయకులు పి.రూప్‌కుమార్‌యాదవ్, బి.శ్రీకాంత్‌రెడ్డి, తాటి వెంకటేశ్వర్లు, స్వర్ణ వెంకయ్య, ఆలయ వ్యవస్థాపక ఛైర్మెన్ రత్నం జయరామ్, ఇ.ఓ వెండిదండి శ్రీని వాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొన్న మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్, ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వైకాపా నాయకులు

## 29 నుండి వైభవోపేతంగా శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు...

శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం 45వ శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఈ నెల 29వ తేదీ నుండి అక్టోబర్ 8వ తేదీ వరకు జరుగనున్నాయి. అమ్మవారు ఈ నెల 29వ తేదీ చండీ అలంకారం, 30వ తేదీ భవాని అలంకారం, అక్టోబర్ 1వ తేదీ గాయత్రి అలంకారం, 2వ తేదీ అన్నపూర్ణ అలంకరం, 3వ తేదీ గజలక్ష్మి అలంకారంలో, 4వ తేదీ సరస్వతి అలంకారంలో, 5వ తేదీ కాళికా అలంకారంలో, 6వ తేదీ దుర్గా అలంకారం, 7వ తేదీ శ్రీ మహిషాసుర మర్ధిని అలంకారం, 8వ తేదీ శ్రీ రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. 8వ తేదీ మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో భక్తులకు అన్నదానం నిర్వహిస్తారు.

# నిలబడి కలబడదాం

## - టిడిపి జిల్లా సమన్వయ కమిటి సమావేశంలో నేతలు



రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం సాగిస్తున్న దౌర్జన్యకాండను సమిష్టిగా నిలబడి అడ్డుకుందామని, ప్రజలకు అండగా నిలుద్దామని జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు తీర్మానించుకున్నారు. ఈ నెల 25వ తేదీన నెల్లూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర అధ్యక్షతన పార్టీ జిల్లా సమన్వయకమిటి సమావేశం జరిగింది. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాజీ మంత్రులు పి.నారాయణ, పరసా రత్నం, టి.రమేష్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, మాజీఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, పాశం సునీల్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి.అనూరాధ, మాజీ నుడాఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నాయకులు బెజవాడ ఓబుళరెడ్డి, ఆనం జయకుమార్‌రెడ్డి, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, గూటూరు మురళీ కన్నబాబు, ఆనం వెంకటరమణారెడ్డి, సిహెచ్ హరిబాబుయాదవ్, జెన్ని రమణయ్య, గూడూరు రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో తొలుత మాజీస్పీకర్ కోడెల శివప్రసాద్‌రావు, మాజీ ఎంపి ఎన్.శివ ప్రసాద్, అలాగే గోదావరి బోటు మృతులకు సంతాప సూచకంగా రెండు నిముషాలు మౌనం పాటించారు. అనంతరం సమావేశంలో రైతు ఋణమాఫీ జి.ఓను వైసిపి ప్రభుత్వం రద్దు చేయడాన్ని ఖండించారు. గ్రామ, సచివాలయ ఉద్యోగాలన్నీ వైసిపి వాళ్ళకే ఇచ్చుకుంటున్నారని ఆరోపించారు. వైసిపి అధికారంలోకి వచ్చాక అనేక ప్రాంతాల్లో ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు, భౌతిక దాడులు ఎక్కువయ్యాయని, మీడియా సంస్థలను కూడా అణగదొక్కాలని చూస్తున్నారని ఆరోపించారు.

### భరోసా ఇచ్చేందుకే బాబు వస్తున్నారు...

మాజీముఖ్యమంత్రి, తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు అక్టోబర్ 14, 15తేదీలలో జిల్లాలో పర్యటించనున్నారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత చంద్రబాబు జిల్లాకు రావడం ఇదే మొదటిసారి. ఆ రెండురోజుల్లో ఆయన కార్యకర్తల కోసంగానూ, అలాగే నియోజకవర్గాల వారీగాను సమీక్షలు నిర్వహించనున్నారు.

# ఎన్‌బికెఆర్‌తో జపాన్ సంస్థ ఒప్పందం




కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కాలేజీతో జపాన్‌కు చెందిన మెడిన్‌షా కార్పొరేషన్ (టోక్యో), ప్రైమ్ మేడియన్ సంస్థ సాంకేతిక పరిజ్ఞానం బదలాయింపుపై మూడవసారి ఒప్పందం కుదుర్చుకున్నాయి. కళాశాలలో ఈనెల 25న జరిగిన కార్యక్రమంలో మెడిన్‌షా కార్పొరేషన్ డైరెక్టర్ హిరాకి వకుయి, ప్రైమ్ మేడియన్ సంస్థ ప్రతినిధులు, కళాశాల కరెస్పాండెంట్ రామ్ కుమార్‌రెడ్డిలు పాల్గొని ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా మెడిన్‌షా డైరెక్టర్ హిరాకి వకుయి మాట్లాడుతూ, గతంలో ప్రధాని మోడీ జపాన్‌కు వచ్చినప్పుడు తమ కంపెనీ డైరెక్టర్లతో చర్చించారని, కేంద్రప్రభుత్వ ఆధీనంలో నిర్వహిస్తున్న స్కిల్ ఇండియాకు సహకరించేందుకు తమ కంపెనీ ముందుకువచ్చిందని, ఇందులో భాగంగా ఎన్‌బికెఆర్ కళాశాలను తమ కంపెనీ ఎంపిక చేసిందని చెప్పారు. కళాశాల కరెస్పాండెంట్ రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత మూడేళ్ళుగా జపాన్ పరిజ్ఞానాన్ని తమ విద్యార్థులకు అందిస్తున్న ఆ కంపెనీల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌బికెఆర్ కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కిషంధర్ పాల్గొన్నారు.



# చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే చర్యలు తప్పవు

చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ శేషగిరిబాబు హెచ్చరించారు. ఈనెల 24న నెల్లూరు జిల్లా టీపీ గూడూరు మండలం వరకవిపూడి చెరువును జిల్లా ఎస్పీ రస్తోగితో పాటు కలెక్టర్ పరిశీలించారు. గిరిజనులు సాగుచేస్తున్న చేపల చెరువు తొలగింపు, టెంకాయ చెట్ల ధ్వంసంపై గిరిజనులు న్యాయ సేవాధికార సంస్థని ఆశ్రయించడంతో అధికార పార్టీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయడంతో వరకవిపూడి చెరువును కలెక్టర్, ఎస్పీ పరిశీలించి ధ్వంసం చేసిన భూములను పరిశీలించి సాగు వివరాలు, అక్రమణలు, ఆయకట్టు సమస్యలపై గ్రామ ప్రజలతో పాటు అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెరువు పరిస్థితిపై విచారణకు ఆదేశించి ఆర్డీవో స్థాయి ప్రత్యేకాధికారిని నియమిస్తున్నట్లు తెలిపారు. నష్టపోయిన బాధితులకు న్యాయం చేస్తామన్నారు.

# కిక్ బాక్సింగ్‌లో బంగారు పతకాలు

## సత్తాచాటిన డా॥ కిషోర్స్ రత్నం విద్యార్థులు



తాను సాధించిన పతకాన్ని చూపిస్తున్న ఎస్.వర్షిత

విశాఖపట్టణంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో నెల్లూరు దైకస్‌రోడ్డులోని డాక్టర్ కిషోర్స్ రత్నం మోడల్‌స్కూల్, గాయత్రినగర్ లోని డాక్టర్ కిషోర్స్ రత్నం శ్రీకృష్ణదేవ రాయ పాఠశాల విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. 7వ తరగతి చదువుతున్న ఎస్.వర్షిత, 6వ తరగతి విద్యార్థి జి.గంగా తరుణ్‌రెడ్డిలు ఈ పోటీలో సత్తా చూపి బంగారు పతకాలు సాధించడం ఎంతైనా విశేషం. విజేతలను ఈనెల21న పాఠశాల డైరెక్టర్ కృష్ణకిషోర్ అభినందించారు. ఈ అభినందన కార్యక్రమంలో ఆ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు, ఏ.ఓ రుక్మిణీదేవి, సునీల్, తుహినా, హరికిషన్, మేనేజర్ విజయచంద్ర, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

# వెలుగవుతుందా?

(మొదటి పేజీ తరువాయి)

వరద జలాలను కొంతవరకు ఆపుకోగలం. అలాగే గోదావరి నీళ్ళను దుమ్ముగూడెం నుండి నాగార్జున సాగర్‌కు మళ్లించి, అక్కడి నుండి రివర్స్ టర్బైన్‌ల ద్వారా శ్రీశైలం డ్యాంకు తరలించాలన్నది ప్రధాన ప్రణాళిక! ఇది ఇంకా ప్రాథమిక దశలోనే వుంది. ఇదేగనుక ఆచరణలోకి వస్తే తెలంగాణలో దక్షిణాది జిల్లాలతో పాటు ఏపిలో రాయలసీమలోని నాలుగు జిల్లాలతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు నీటి సమస్య వుండదు. అయితే ఈ ప్రణాళికకు ఏ ప్రభుత్వం ఎంత ఖర్చు పెట్టాలి, ఎవరెన్ని నీళ్ళు తీసుకోవాలనేదానిపై ఇంకా స్పష్టత రాలేదు.

కాకపోతే ఇరు రాష్ట్రాల సీఎంలు భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలి. ఈరోజు జగన్ - కేసీఆర్‌లు స్నేహంగా వున్నారు. తర్వాత కాలంలో ప్రభుత్వాలు మారొచ్చు. అప్పుడు వచ్చే సీఎంలు ఇలాగే స్నేహంగా వుంటారనే గ్యారంటీ లేదు. జగన్-కేసీఆర్‌ల మధ్యే ఎప్పుడైనా విభేదాలు రావొచ్చు. అప్పుడు వీరి రాజకీయ స్పర్ధలు ఇరు రాష్ట్రాలకు సమస్య కాకూడదు.

ఒకసారి చంద్రబాబు వల్ల ఇలాగే ఆంధ్రప్రదేశ్ నష్టపోయింది. ఆయన తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నామినేటెడ్ ఎమ్మెల్సీ స్టీఫెన్‌సన్ ఓటు కొనుగోలుకు పాల్పడి 'ఓటు-నోటు' కేసులో దొరికాడు. ఆ కేసు భయంతో పదేళ్ళు ఉమ్మడి రాజధానిగా వున్న హైదరాబాద్‌ను వదిలేసి కృష్ణానది కరకట్టకు పరుగెట్టాడు. కాబట్టి ముఖ్యమంత్రుల నిర్ణయాలు రాజకీయ పరమైన ప్రయోజనాలతో కాకుండా రాష్ట్రాల ప్రయోజనాలే పరమావధిగా వుండాలి. రెండు తెలుగు రాష్ట్రాలకు ప్రగతి వెలుగులిచ్చేలా ఇద్దరి అడుగులు ముందుకు పడాలి!

# అసంతృప్తి జాడలు!

(మొదటి పేజీ తరువాయి)

దూరంగా వుండాలని ఆయన పదేపదే హెచ్చరిస్తున్నాడు. ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ముడుపులు తీసుకున్నారని ఆరోపణలు వచ్చిన ఎమ్మెల్యేలను మొదట్లోనే ఆయన పిలిచి గడ్డిపెట్టారు. దీంతోనే జగన్ అవినీతిని లేకుండా చేస్తానని కామెడీకి చెప్పలేదని, సీరియస్‌గానే తీసుకున్నాడన్నది అందరికీ అర్థమైంది.

చంద్రబాబు తన ఐదేళ్ళ పాలనా కాలంలో మంత్రులు, ఎమ్మెల్యేలకు ఫ్రీహ్యాండిచ్చాడు. ఇసుక, సిలికా, రాజధాని భూములు, అధికారుల బదిలీలు, మైనింగ్, కాంట్రాక్ట్‌లు... ఇలా ఎన్నింటిలోనో పిండుకునే అవకాశమిచ్చాడు. బాబు ఛాన్స్ ఇస్తే తెలుగు తమ్ముళ్ళు దానిని బాగానే సద్వినియోగం చేసుకున్నారు.

ఇప్పుడు జగన్ జమానాలో పరిస్థితి అలా లేదు. ఏదైనా పారదర్శకంగానే. ఇసుక, మద్యం వ్యాపారాలు ప్రభుత్వ ఆధీనంలోకొచ్చాయి. కాంట్రాక్ట్ పనులన్నీ రివర్స్ టెండర్లలో వున్నాయి. రాజధాని భూముల భాగోతం లేదు. ఆఖరకు గ్రామ సచివాలయం ఉద్యోగాలలో ఒక్క ఉద్యోగం కోసం కూడా సిఫార్సు చేసే పరిస్థితి లేదు. ప్రభుత్వం వస్తే సంబంధిత అధికార పార్టీ నాయకులు సంపాదించడానికి అడ్డదారులెన్నుంటాయో వాటన్నింటిని జగన్ మూసేసుకుంటూ వస్తున్నాడు. అందుకే జగన్ పాలనపై ఆ పార్టీ వారికే అసంతృప్తి.!

# ఎర్రగడ్డల అంగళ్ళపై విజిలెన్స్ పంజా

- ఆరు అంగళ్ళు సీజ్.
- రూ.42.59 లక్షల విలువైన సరుకు స్వాధీనం

ప్రభుత్వ నిబంధనలు లెక్క చేయకుండా ఎర్రగడ్డల వ్యాపారం చేస్తున్న ఆరు అంగళ్ళను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సీజ్ చేశారు. అక్కడ వున్న రూ.42.59 లక్షల విలువైన 98.25 టన్నుల ఎర్రగడ్డలను సీజ్ చేసి మార్కెటింగ్ శాఖ అధికారులకు అప్పగించారు.

ఈనెల 24న విజిలెన్స్ అధికారులు జిల్లా వ్యాప్తంగా ఎర్రగడ్డల అంగళ్ళపై దాడులు చేశారు. ఇటీవల ఎర్రగడ్డల ధరలు అమాంతం పెరగడంతో అధికారులు రంగంలోకి దిగి ఎందుకు పెరుగుతున్నాయో కారణాలు తెలుసుకుని నివేదికను ప్రభుత్వానికి పంపారు. అసలు వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా సరైన రికార్డులు నిర్వహించకుండా, మార్కెటింగ్ శాఖకు చెల్లించాల్సిన పన్నులు కట్టకుండా, ఎంత సరుకు తెచ్చారు. ఎంత అమ్మారు, ఇంకా స్టాకు ఎంత ఉందనే వివరాలు లేకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో విజిలెన్స్ అధికారులు ఆ అంగళ్ళ మీద దాడులు చేశారు. నెల్లూరులో ఆనంద్ ఆనియన్స్, కామాక్షితాయి



ఆనియన్స్, ఏవీయస్ ఆనియన్స్, కందె ఆనియన్స్ అంగళ్ళను సీజ్ చేశారు. కావలిలో కూడా అధికారులు దాడులు చేసి శ్రీ జయలక్ష్మీ ఆనియన్ మర్చంట్స్, శ్రీకృష్ణ ఆనియన్స్ అంగళ్ళను సీజ్ చేశారు. విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎన్‌వీ సుబ్బారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు మాణిక్యాలరావు, వీవీ నారాయణ, డీసీటీవో విష్ణు, ఎఫ్‌వో రాజేంద్రప్రసాద్, ఏఆర్ శ్రీనివాసులురెడ్డి, మార్కెటింగ్ శాఖ అధికారులు నవీన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి గూటికి కమలాకర్



నెల్లూరురూరల్ మండలం కోడూరుపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకుడు కోడూరు కమలాకర్‌రెడ్డి ఈ నెల 21వ తేదీన తన మందీమార్బలంతో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రూరల్ కార్యాలయ సమన్వయకర్త కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిల సమక్షంలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరాడు. లెక్చరర్స్ కాలనీ నుండి తన అనుచరులతో ఆయన ర్యాలీగా బయలుదేరి వైసిపి రూరల్ కార్యాలయంలో చేరుకున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన సభలో కమలాకర్‌రెడ్డికి, ఆయన అనుచరులకు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పారు. పార్టీలో కమలాకర్‌రెడ్డికి తగిన ప్రాధాన్యత వుంటుందని శ్రీధర్‌రెడ్డి హామీ ఇచ్చాడు.

## దసరాకు ప్రత్యేక బస్సులు

# నడపనున్న ఆర్టీసి

దసరా సెలవులను పురస్కరించుకుని ప్రయాణీకుల సౌకర్యం కోసం ఆర్టీసి అధికారులు ప్రత్యేకబస్సులను నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నెల్లూరు రీజియన్ పరిధిలో హైదరాబాద్‌కు 52 ప్రత్యేకబస్సులను నడపనున్నారు. అక్టోబర్ 4వ తేదీన 25 బస్సులు, 5వ తేదీన 15 బస్సులను హైదరాబాద్‌కు నడపనున్నారు. మిగిలిన బస్సులను రోజుకు రెండు లేదా అంతకంటే ఎక్కువగా బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా బెంగుళూరు, చెన్నై, కడప తదితర ప్రాంతాలకు సైతం ప్రత్యేక బస్సుల నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని, ఈ ప్రత్యేకబస్సుల్లో 50 శాతం అదనపు చార్జీలుంటాయని ఆర్టీసి వర్గాలు వెల్లడించాయి.

# రివర్స్.. సక్సెస్

2014-19ల మధ్య చంద్రబాబు ఐదేళ్ళ పాలనాకాలంలో ఏ పని జరిగినా కూడా దానికి అవ్వాల్సిన ఖర్చుకంటే రెండు నుండి నాలుగింతలు అంచనా పెంచారనే ఆరోపణలున్నాయి. అప్పుడు జరిగిన ఏ పనులను చూసినా ఆ ఆరోపణలను నిజం అని నమ్మక తప్పదు. అమరావతిలో రాజధాని భవనాల నిర్మాణం కోసం చంద్రబాబు కాంట్రాక్ట్ సంస్థలకు ఇచ్చిన ధర అడుగుకు 10వేల రూపాయలు. మహానగరాలలో 2500 రూపాయలకే చదరపు అడుగు విలువతో అద్భుతంగా నిర్మాణాలు చేస్తున్నారు. గోదావరి, కృష్ణ పుష్కరాలలో చేసిన పనుల అంచనాలు చూస్తే ఎవరికైనా కళ్ళు బైర్లు కమ్ముతాయి. లక్ష కూడా విలువ చేయని పనులను అయిదారు లక్షల అంచనాతో చేసేసుంటారు. పోలవరం ప్రాజెక్ట్ అంచనా వ్యయం తొలుత 16వేల కోట్లు. ఈ ప్రాజెక్ట్‌ను నేనే కట్టి తీరాలంటూ కేంద్రం నుండి తన చేతుల్లోకి పోలవరాన్ని తీసుకున్న చంద్రబాబు కేవలం రెండేళ్ళలోనే 16వేల కోట్లుగా వున్న అంచనా వ్యయాన్ని 56వేల కోట్లకు తీసుకుపోయాడు.

తాను అధికారంలోకి వస్తే రాష్ట్రంలో అవినీతిని అంతమొందిస్తాననేది వైసిపి అధినేతగా వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ. ఆయన సీఎంగా బాధ్యతలు చేపట్టగానే పోలవరం మరియు ఇతర భారీ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ల కాంట్రాక్ట్‌లపై దృష్టి పెట్టాడు. అంచనా వ్యయం భారీగా పెంచారనే అనుమానా లున్న కాంట్రాక్ట్‌లన్నింటినీ రద్దు చేశాడు. రివర్స్ టెండరింగ్ ద్వారా అంచనా వ్యయాన్ని తగ్గించి ప్రభుత్వ ధనాన్ని ఆదా చేయాలని సంకల్పించాడు. ఈ క్రమంలోనే రివర్స్ టెండర్లు మొదలయ్యాయి. పోలవరం 65వ ప్యాకేజీ పనులను ఇటీవలే మాక్స్‌మో సంస్థ దక్కించుకుంది. రివర్స్ టెండర్ ద్వారా ఈ ప్యాకేజీలో ప్రభుత్వానికి 58.53కోట్లు ఆదా అయ్యింది.

కాగా, పోలవరం హెడ్‌వర్క్స్, జల విద్యుత్ కేంద్రం పనుల్లో తాజాగా నిర్వహించిన రివర్స్ బిడ్‌లో ప్రభుత్వానికి ఏకంగా 782.8కోట్లు ఆదా అయ్యాయి. హెడ్‌వర్క్స్ పనుల్లో 223.2 కోట్లు ఆదా కాగా, జల విద్యుత్ కేంద్రం పనుల్లో 559.6కోట్లు ఆదా అయ్యాయి. గతంలో ఈ రెండు పనులను కూడా నవయుగ సంస్థకు 4.8శాతం అధిక ధరలు (పోలవరం హెడ్‌వర్క్స్ పనులు 3302.22 కోట్లకు, జల విద్యుత్ కేంద్రం పనులను 3216.11కోట్లకు) ఇచ్చి వున్నారు. జల విద్యుత్ కేంద్రం పనులు ఇంతవరకు మొదలు పెట్టలేదు కాబట్టి మొత్తానికి, పోలవరం హెడ్‌వర్క్స్‌లో మిగిలిపోయిన 1771.44కోట్ల పనులకు రివర్స్ టెండర్ నిర్వహించగా ఈ రెండు పనులకు కూడా 12.6శాతం తక్కువ ధరకు కోట్ చేస్తూ టెండర్ వేసి మేఘా ఇంజనీరింగ్ కంపెనీ దక్కించుకుంది. రివర్స్ బిడ్‌లో మేఘా ఒక్కటే పాల్గొన్నప్పటికీ ప్రభుత్వం ఆశించినట్లుగా అంచనా వ్యయం తగ్గడంతో ఆ సంస్థకే ఈ పనులు అప్పగించే అవకాశాలున్నాయి.

ఇంకా పోలవరంలో పలు ప్యాకేజీలతో పాటు రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్ట్‌ల కాంట్రాక్ట్‌లన్నింటికీ కూడా ప్రభుత్వం రివర్స్ టెండర్లనే అనుసరించబోతుంది. పోలవరం రివర్స్ టెండర్‌లో ఆశించిన ఫలితాలు బాగా కనిపించడంతో ప్రభుత్వం ఇక రివర్స్ టెండర్ విధానాన్ని వేగంగా అమలు చేయనుంది.

# 'నిర్బంధ తమిళం' నుంచి మనోళ్లకి విముక్తి



- మరో మూడేళ్లు తెలుగులోనే పరీక్షలు
- పోరాడి సాధించిన ప్రొ.సిఎంకె రెడ్డి

తమిళనాడు రాష్ట్రంలోని తెలుగు సహా మైనార్టీభాషలకు సంబంధించిన విద్యార్థులకు 'నిర్బంధ తమిళం' నుంచి మరో మూడేళ్ళ పాటు తమ మాతృభాషలో పదవతరగతి పరీక్షలు రాసే అవకాశాన్ని కల్పిస్తూ మద్రాసు హైకోర్టు తీర్పునిచ్చింది. అఖిలభారత తెలుగు సమాఖ్య, తమిళనాడు అల్పసంఖ్యాక భాషల ఫోరం (లింగ్విస్టిక్ మైనార్టీస్ ఫోరమ్ ఆఫ్ తమిళనాడు–లింఫోట్) ఛైర్మెన్ ప్రొఫెసర్ సిఎంకె రెడ్డి చేసిన సుదీర్ఘ న్యాయపోరాటం ఎట్టకేలకు ఫలించింది. టెన్త్ విద్యార్థులు తప్పనిసరిగా తమిళ సబ్జెక్టు రాయాల్సి ఉందంటూ 1996లో అప్పటి డిఎంకె ప్రభుత్వం 'నిర్బంధ తమిళచట్టం' తీసుకు రావడంతో, అందుకు అభ్యంతరం తెలుపుతూ పదవతరగతి విద్యార్థులు తమ మాతృభాషలోనే పరీక్షలు రాసేందుకు వీలు కల్పించాలని మైనార్టీభాషలవారు తమిళనాడు ప్రభుత్వాల్ని కోరుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రొఫెసర్ సిఎంకె రెడ్డి చేసిన కృషి ఫలితంగా 2022 వరకు ఆ మేరకు వెసులుబాటు కల్పిస్తూ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.మణికుమార్, జస్టిస్ అబ్దుల్ ఖుద్దూస్, జస్టిస్ సుబ్రమణియన్‌లతో కూడిన ధర్మాసనం ఈనెల 23న తీర్పు వెలువరించింది. దేశంలో ఒక్క తమిళనాడులో మాత్రమే ఈ విషయమై భాషా సమస్య ఏర్పడిందని, రాష్ట్ర జనాభాలో 40శాతానికి పైగానే మైనార్టీ భాషలు మాట్లాడేవారున్నారని, వారందరికీ ప్రభుత్వం న్యాయం చేయాల్సి ఉందని ఈ సందర్భంగా సిఎంకె రెడ్డి కోరారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో నివసిస్తున్న తమిళకుటుంబాల వారి పిల్లలు వారి మాతృభాషలోనే చదువుకునేందుకు ప్రభుత్వాలు పాఠశాలలు ఏర్పాటుచేసి ప్రోత్సహిస్తున్నాయని, తమిళనాడు మాత్రం అందుకు అంగీకరించకపోవడం దురదృష్టకరమని అంటూ, అల్పసంఖ్యాక భాషల విద్యార్థులు గత అయిదేళ్ళుగా ఇలా న్యాయస్థానం ఉత్తర్వులతోనే తమ మాతృభాషలో పరీక్షలు రాయగలుగుతున్నారని ఆయన పేర్కొన్నారు. తమిళనాట తెలుగువారి ముద్దుబిడ్డగా తెలుగువారి హక్కుల కోసం నిత్యం పోరాటంచేస్తూ తెలుగు ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తున్న మన నెల్లూరీయుడు.. ప్రొ. ముద్దుకృష్ణారెడ్డి అభినందనీయుడు.

## జిల్లాలో...

# నాలుగు నగర పంచాయితీలు

***జిల్లాలో మరో నాలుగు మేజర్ పంచాయితీలు నగర పంచాయితీలుగా మారనున్నాయి. రాష్ట్ర మున్సిపల్, పంచాయితీ రాజ్ మంత్రుల సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో బుచ్చిరెడ్డిపాలెం, వింజమూరు, కోట, అల్లూరులు నగర పంచాయితీలు కానున్నాయి. ఈసారి వీటిలో పంచాయితీలతో పాటు కాకుండా మున్సిపాల్టీలతో పాటు పార్టీల గుర్తుల మీదే ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి.***

జిల్లాలో కొత్త మున్సిపాల్టీల ఏర్పాటుకు సంబంధించి ఈ ఏడాది జనవరిలో రాష్ట్ర ప్రభుత్వానికి కలెక్టర్ నివేదిక పంపారు. దీని ప్రకారం బుచ్చి, కోట, పొదలకూరు, రాపూరు ఉదయగిరి, అల్లూరు, వింజమూరు, కోవూరులను మున్సిపాల్టీలుగా మార్చడానికి అవకాశం వుందంటూ ఆ నివేదికలో పేర్కొన్నారు. అయితే ఈ ఎన్నికల వరకు నాలుగు మేజర్ పంచాయితీలనే నగర పంచాయితీలుగా మార్చడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

బుచ్చిరెడ్డిపాలెంతో పాటు చుట్టుపక్కల వున్న వేపూరు, కట్టుబడిపాలెం, ఇస్కపాలెం, పల్లెపాలెం పంచాయితీలను కలిపి బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయితీ ఏర్పాటు కానుంది. కోటతో పాటు జరుగుమల్లి, కొక్కుపాడు, తిమ్మానాయుడుపల్లి, గూడలి, వెంకన్నపాలెం, విద్యానగర్ పంచాయితీలను కలుపుకుని కోట నగర పంచాయితీ ఏర్పాటు కానుంది. అల్లూరు నగర పంచాయితీలో అల్లూరు, సింగపేట, నార్త్‌మోపూరు పంచాయితీలను కలిపారు. ప్రస్తుతం మేజర్ పంచాయితీగా వున్న వింజమూరులో మాత్రం ఏ పంచాయితీలను విలీనం చేయకుండానే నగర పంచాయితీగా మార్చనున్నారు.

జిల్లాలో నెల్లూరు కార్పొరేషన్, గూడూరు, కావలి, వెంకటగిరి, ఆత్మకూరు, సూళ్లూరుపేట మున్సిపాల్టీలు వుండగా, నాయుడుపేట మాత్రమే నగర పంచాయితీగా వుంది. ఇప్పుడు జిల్లాలో కొత్తగా మరో నాలుగు నగర పంచాయితీలు ఏర్పాటవుతాయి. దీనివల్ల మున్సిపల్ ఎన్నికలు జరిగితే జిల్లాలో 9అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎన్నికల హడావిడి వుంటుంది. ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలో తప్పితే మిగిలిన 9 నియోజకవర్గాలలో మున్సిపాల్టీయో, నగర పంచాయితీయో ఏదో ఒకటి ఉన్నట్లే!

# డెయిరీ డైరెక్టర్ల ఎన్నికల్లో రంగయ్య ప్యానెల్ 'విజయ'ం



నెల్లూరుజిల్లా పాల ఉత్పత్తిదారుల సమాఖ్య(విజయ డెయిరీ)లో మూడు డైరెక్టర్ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ప్యానెల్ ఘనవిజయం సాధించింది. రంగారెడ్డి ప్యానల్ తరపున పోటీ చేసిన అన్నంరెడ్డి వరదారెడ్డి, పెద్దిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఇసనాక సునీల్‌కుమార్‌రెడ్డిలు ఘనవిజయం సాధించారు. 26వ తేదీ మధ్యాహ్నం దాకా పోలింగ్ జరుగగా మధ్యాహ్నం నుండి ఓట్లు లెక్కించారు. ఫలితాల అనంతరం రంగారెడ్డి అనుచరులు డెయిరీ ఆవరణలో సంబరాలు జరుపుకున్నారు.



## తిరుమలేశుని సేవకురాలిగా

# శ్రీమతి ప్రశాంతిరెడ్డి ప్రమాణం

తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యురాలుగా ప్రభుత్వంచే నియమించబడ్డ రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి శ్రీమతి ప్రశాంతిరెడ్డి ఈ నెల 21వ తేదీ శనివారం ఉదయం 11గంటలకు స్వామివారి సన్నిధిలో ప్రమాణస్వీకారం చేశారు. భర్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మరియు తమ కుటుంబసభ్యులతో కలిసి తిరుమలలో స్వామివారి దర్శనం చేసుకున్న అనంతరం వేదపండితుల ఆశీస్సులతో ఆమె టిటిడి పాలకమండలి సభ్యురాలిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులను టిటిడి జె.ఇ.ఓ బసంతకుమార్ పట్టువస్త్రాలతో ఘనంగా సత్కరించి స్వామివారి చిత్రపటం, తీర్ధప్రసాదాలు అందజేశారు.



**ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సేవాసప్తాహంలో భాగంగా నెల్లూరు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో బిజెవైఎం ఆధ్వర్యంలో రోగులకు అన్నదానం నిర్వహిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి, బిజెవైఎం నాయకులు**






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com